

బడిలో పిల్లలకు గుడ్లు ఇవ్వొద్దు: డీఈఓ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని స్కూళ్లలో 12, 13 తేదీల్లో విద్యార్థులకు కోడి గుడ్లు ఇవ్వకూడదని డీఈఓ ప్రసాద్ బాబు మంగళవారం ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలను ఆదేశించారు. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ కారణంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రెండు రోజుల పాటు విద్యార్థులకు కోడి గుడ్లు ఇవ్వకూడదని ఆయన ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, 48 గంటలపాటు విద్యార్థులకు గుడ్లు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హెచ్చెల్సీకి నీరు బంద్ ♦ నిప్పుతో ముప్పు..! ♦ దగాపడ్డ రైతు..! 6





ప దీక్షలకు రుగులు

పాత డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగం



జిల్లాలో చురుగ్గా ఏర్పాట్లు

135 కేంద్రాలు..

32,803 మంది విద్యార్థులు

రెగ్యులర్, ఓపెన్.. అందరికీ అవే కేంద్రాలు



అనంతపురం విద్య, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పదో తరగతి-2025 పరీక్షల సందడి మొదలైంది. జిల్లావ్యాప్తంగా 135 కేంద్రాల్లో ఈ ఏడాది పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 33,917 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 32,803 మంది, ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ స్టడీ కేంద్రాల విద్యార్థులు 1,114 మంది ఉన్నారు. అందరికీ ఒకేసారి, అవే కేంద్రాలలో పరీక్షలను నిర్వహిస్తారు. అయితే ఓపెన్ స్కూల్ విద్యార్థులకు వేరే కేంద్రాలలో పరీక్షలు నిర్వహించాలని స్టడీ కేంద్రాల నిర్వాహకులు కోరుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై రాష్ట్ర వ్యాప్తంగా కొందరు కో-ఆర్డినేటర్లు కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. పది పరీక్షలకు జిల్లాలో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి.

270 మంది సీఎస్.. డీఓలు

జిల్లాలో పదో తరగతి పరీక్షలు 135 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ప్రైవేట్ సెక్టార్ స్కూళ్లలో 46, ప్రభుత్వ సెక్టార్ స్కూళ్లలో 89 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్టుమెంటల్ ఆఫీసర్‌ను నియమిస్తారు. డిప్యూటీ డీఈఓలు తమ పరిధిలో సీఎస్‌లు, డీఓల నియామకానికి కసరత్తును ప్రారంభించారు. త్వరలో నియామక ప్రక్రియ పూర్తి అవుతుందని పరీక్షల విభాగం అధికార వర్గాలు తెలిపాయి.

3.15 లక్షల జవాబు పత్రాలు

పదో తరగతి పరీక్షలకు అవసరమైన ఆన్సర్ షీట్స్ జిల్లాకు చేరాయి. విద్యార్థులకు అందజేసే 24 పేజీల బుక్ లెట్స్, 12 పేజీల బుక్ లెట్స్ 3,15,700 జిల్లాకు సరఫరా చేశారు. 65 వేల గ్రాఫ్ పేపర్లను సైతం జిల్లాకు చేర్చారు. డిసెంబరు చివరి వారంలోనే ఆన్సర్ బుక్‌లెట్స్, గ్రాఫ్ పేపర్లు జిల్లాకు వచ్చాయి. నగరంలోని కేఎస్ఆర్ హైస్కూల్‌లోని భద్రపరిచారు. ప్రశ్నాపత్రాలు మార్చి మొదటి వారంలో జిల్లాకు వస్తాయని తెలిసింది.

597 పాఠశాలల నుంచి..

పదో తరగతి పరీక్షలకు 597 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరుకానున్నారు. రెగ్యులర్ విద్యార్థులు 31,009 మంది కాగా, గత ఏడాది పరీక్షల్లో ఫెయిల్ అయ్యి, ఈ ఏడాది పరీక్షలకు హాజరకానున్న ప్రైవేట్ విద్యార్థులు 1,794 మంది ఉన్నారు. వీరితోపాటు 1,114 మంది ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. గతంలో రెగ్యులర్, ఓపెన్ విద్యార్థులకు వేర్వేరు సెంటర్లలో నిర్వహించేవారు. ఈ ఏడాది కూడా అలాగే నిర్వహించాలని డిమాండ్ ఉంది. కానీ రాష్ట్ర స్థాయి పరీక్షల విభాగం అధికారులు అందరికీ కలిపి నిర్వహించేలా నిర్ణయించారు.

వారంలోగా నియామకాలు..



పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నాము. మొత్తం 135 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నాం. సీఎస్‌లు, డీఓల నియామక ప్రక్రియ వారం రోజుల్లో పూర్తవుతుంది. డీఈఓ ఆదేశాలలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

- గోవింద్ నాయక్, అసిస్టెంట్ కమిషనర్, ఎగ్జామ్స్

జేఈఈ మెయిన్స్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల సత్తా 7

బతుకు ముగించారు.. వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య 7

చూసిన కనులదే భాగ్యము నేడు కొండమీదరాయుడి బ్రహ్మరథోత్సవం ఉదయం 11:30 గంటలకు మడుగుతేరు 6









సీడ్ జొన్న రైతులను ఆదుకోండి

ఏపీ రైతు సంఘం నాయకులు



టెక్నికల్ ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సీడ్ జొన్న సాగు చేసిన విడపనకల్లు మండలం హావళిగి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జేడీఏ కార్యాలయంలో టెక్నికల్ ఏఓ బాలూ నాయక్‌కు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బీహెచ్‌రాయుడు మంగళవారం వినతిపత్రం అందజేశారు. దళారుల ద్వారా సాగు చేయించి, వారిద్వారానే కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయని అన్నారు. మూడు దశాబ్దాల నుంచి రెండు వేల ఎకరాల్లో సీడ్ జొన్న సాగు చేస్తున్నారని, మూడు వేల క్వింటాళ్ల పంట రైతుల వద్ద నిల్వ ఉందని అన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధర ఉందని, కానీ కొందరు వ్యాపారులు కుమ్మక్కై ధరను తగ్గించి రైతులకు అన్యాయం చేయాలని కుట్ర పన్నుతున్నారని అన్నారు. బయటి వ్యాపారులు అక్కడికి వెళ్లకుండా స్థానిక వ్యాపారులు బెదిరిస్తున్నారని అన్నారు. అధికారులు జోక్యం చేసుకుని, సీడ్ జొన్నకు గిట్టుబాటు ధర కల్పించి, రైతులను ఆదుకోవాలని కోరారు.

మీ వాటా పంపాను కదా..!

- ఎస్ఐతో వైసీపీ నాయకుడి వాగ్వాదం
- మట్టి తరలింపు వాహనాల సీజ్‌పై ఆగ్రహం



సీజ్‌చేసిన టిప్పర్లు (ఫైల్)

పుట్లూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 'మీ వాటా మీకు పంపాను కదా..? నా టిప్పర్లను ఎందుకు సీజ్ చేశారు సార్?' అంటూ ఎస్ఐ వెంకటనరసింహంతో వైసీపీ నాయకుడు ఒకరు వాగ్వాదానికి దిగారు. పుట్లూరు పోలీస్‌స్టేషన్‌లో రెండురోజుల కిందట ఈ ఘటన జరిగింది. చాలవేముల శివారులోని పట్టా భూముల్లో మట్టిని వైసీపీ నాయకుడు అక్రమంగా తరలిస్తున్నాడని సమాచారం. ఇబ్బంది లేకుండా ఓ పోలీసు అధికారికి ఏకంగా రూ.55వేలు ఫోన్‌పే ద్వారా పంపినట్లు సమాచారం. కొత్తగా వచ్చిన ఎస్ఐ సంఘటనా స్థలానికి వెళ్లి 9 టిప్పర్లు, 2 ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆ వైసీపీ నాయకుడు, ఏకంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐపై చిందులు తొక్కినట్లు తెలుస్తోంది. మీ వాటా మీకు పంపినా టిప్పర్లను ఎలా సీజ్ చేస్తారని మండిపడినట్లు సమాచారం. దీంతో ఆగ్రహించిన ఎస్ఐ, వైసీపీ నాయకుడికి వార్నింగ్ ఇచ్చాడని, వైసీపీ నాయకుడు ఫోన్‌పే ద్వారా రూ.55 వేలు పంపిన స్క్రీన్‌షాట్లను చూపించారని సమాచారం. దీంతో 'బాబూ.... నీ డబ్బుల గురించి నాకేం తెలియదు. నా డ్యూటీ నేను చేస్తాను' అంటూ సీజ్‌చేసిన వాహనాలను మైనింగ్ అధికారులకు ఎస్ఐ అప్పగించడం గమనార్హం.


- డబ్బుల వ్యవహారంలో కొందరు కానిస్టేబుళ్ల చక్రం తిప్పారని సమాచారం. వైసీపీ నాయకుడు ఫోన్‌పే స్క్రీన్‌షాట్లను ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లకు చూపించడం కలకలం రేపుతోంది. సాధారణంగా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకు తెలియకుండా ఎలాంటి వ్యవహారాలు జరగవు. కానీ ఇక్కడ ఎస్ఐకు తెలియకుండా వేల రూపాయలు చేతులు మారాయని ప్రచారం జరుగుతోంది.

ఆ విషయం నాకు తెలియదు...

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను సీజ్ చేశాం. డబ్బుల వ్యవహారం నాకేం తెలియదు. తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు వాహనాలు అప్పగించాం. **- ఎస్ఐ**

గుప్తనిధుల కోసం నరబలి

చిత్రదుర్గ జిల్లాలో దారుణం.. హంతకుడు కదరంపల్లివాసి



పోలీసుల అదుపులో ఉన్న ఆనంద రెడ్డి, జ్యోతిష్యుడు రామకృష్ణ

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కుందుర్పి మండలం కదరంపల్లికి చెందిన ఆనంద రెడ్డి.. గుప్త నిధుల కోసం నరబలి ఇచ్చారు. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా చెళ్ళకెర తాలూకా పరుశరాంపురంలో ఈ నెల 8వ తేదీ ఆదివారం ఓ యువకుడిని అమ్మవారికి బలి ఇచ్చాడు. తుమకూరు జిల్లా పావగడకు చెందిన రామకృష్ణ అనే జోతిష్యుడి మాటలు నమ్మి ఈ దారుణానికి పాల్పడ్డాడు. పరుశరాంపురానికి పడమటి వైపున ఉన్న మారెమ్మ ఆలయం వద్ద గుప్త నిధులు ఉన్నాయని, అమ్మవారికి నరబలి ఇస్తే సొంతమౌతాయని ఆనంద్ రెడ్డికి జ్యోతిష్యుడు చెప్పాడు. దీంతో పరుశరాంపురం బస్టాండు వద్ద చెప్పులు కుట్టుకునే ప్రభాకర్‌ను నమ్మించి.. ఆలయం వద్దకు తీసుకెళ్లి మచ్చుకత్తితో నరికి చంపేశాడు. అతడి రక్తాన్ని మారెమ్మ దేవికి అర్పించాడు. ఈ విషయం స్థానికులకు తెలియడంతో ఆనంద రెడ్డి అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్పీ రంజిత్ కుమార్ బండారు, ఏఎస్పీ కుమారస్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆనంద రెడ్డిని, జోతిష్యుడు రామకృష్ణను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మచ్చు కత్తి, దుస్తులను సీజ్ చేశారు.




హావళిగి ఉన్నత పాఠశాల వద్ద నిల్వ ఉంచిన జొన్న దిగుబడులు

దగాపడ్డ రైతు..!

- హావళిగిలో భారీగా విత్తన జొన్న సాగు
- అధిక దిగుబడులతో అన్నదాత ఆనందం
- అమాంతం ధర తగ్గించేసిన దళారులు
- నష్టానికి విక్రయించుకోలేక అవస్థలు
- ఎండిపోతున్న వేల క్వింటాళ్ల నిల్వలు


కల్లంలో నిల్వలు

విడపనకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అప్పో సప్పో చేసి.. పెట్టుబడి పెట్టి.. ఆరుగాలం శ్రమించి రైతు పండించిన పంట చెల్లని కాసుగా మారిపోయింది. అన్నదాత.. దళారుల చేతిలో ఆటబొమ్మగా మారిపోయాడు. దిగుబడి దండిగా వచ్చిందన్న ఆనందంలో ఉన్న రైతుకు దళారులు దగా చేశారు. అమాంతం ధరను తగ్గించేశారు. కొనడానికి కూడా రాకుండా మొహం చాటేస్తున్నారు. దీంతో వేల క్వింటాళ్ల విత్తన జొన్న దిగుబడిని రైతు నిల్వ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నాడు. తన కష్టం ఎండకు ఎండిపోతుంటే కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. మండలంలోని హావళిగి గ్రామ రైతుల దుస్థితి ఇది. జీబీసీ, హెచ్చెల్సీ, బోరుబావుల కింద దాదాపు 5వేల ఎకరాల్లో విత్తన జొన్న సాగు చేశారు. బళ్లారి జిల్లా మోకా గ్రామానికి చెందిన దళారుల నుంచి గ్రామంలోని కొంతమంది వ్యాపారులు వివిధ రకాల విత్తనాన్ని తెచ్చి రైతులకు విక్రయించారు. రెండు కేజీల సీడ్ జొన్న ప్యాకెట్ రూ.700 ప్రకారం ఎకరాకు రెండు ప్యాకెట్లు విత్తారు. దిగుబడి ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్లు వచ్చింది. ఖర్చులు సొంత పొలం ఉన్న వారికి ఎకరాకు రూ.40వేలు, కౌలు రైతుకు రూ.60వేలు వస్తుంది. గతేడాది విత్తన జొన్నను క్వింటా రూ.4500 నుంచి 4800 ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈసారి దిగుబడి ఎక్కువగా రావడంతో దీనిని క్యాష్ చేసుకునేందుకు దళారులు సిండికేట్‌గా మారారు. నెల రోజుల ముందు ఇదే విత్తన జొన్నను క్వింటా రూ.4200తో కొనుగోలు చేసిన వ్యాపారులు ఒక్కసారిగా ధర తగ్గించేశారు. ప్రస్తుతం రూ.3వేలకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే ఎకరాకి రూ.30 వేలకు మించి రాదు. పెట్టుబడి సొంత పొలం ఉన్న రైతులకు ఎకరాకి రూ.40 వేలు వచ్చింది. ఆ లెక్కన పెట్టుబడి కూడా రాదన్న మాట. దీంతో నష్టానికి ఎలా విక్రయించాలని రైతులు వాపోతున్నారు. దిగుబడిని అలానే ఉంచుకున్నారు. ఒక్కో రైతు వద్ద 600 నుంచి 1500 బస్తాల దిగుబడి నిల్వ ఉంది. దాదాపుగా 40వేల క్వింటాళ్ల జొన్న మూలన పడింది. ఇళ్లలో నిలువ ఉంచుకునేందుకు స్థలం లేని రైతులు ఎక్కడ పడితే అక్కడ ఉంచేస్తున్నారు. 15 నుంచి 20 మంది కలిసి ఓ దగ్గర నిల్వ చేశారు. మరి కొంతమంది పొలాల్లోనే నిల్వ ఉంచి రాత్రి సమయాల్లో కాపలాగా ఉంటున్నారు. ఇంకొంతమంది గోదాముల్లో నిల్వ ఉంచుకున్నారు. ఇక్కడ పండిన విత్తన జొన్నను బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. మరో నెల రోజులు జొన్న దిగుబడి ఎండకు, గాలికి, ఇలాగే ఉంటే పురుగు పట్టి కిలో రూ.10కి కూడా కొనుగోలు చేయరని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంపెనీలతో ఒప్పందం లేకపోవడమే శాపమా?

విత్తన జొన్న పండించే రైతులు.. ఆయా కంపెనీలతో ఒప్పందం లేకపోవడమే వారికి శాపంగా మారిందని తెలుస్తోంది. కంపెనీతో రైతు ఒప్పందం చేసుకుని పంట పండించి ఉంటే వారే కొనుగోలు చేస్తారు. అగ్రిమెంట్ ధర రూ.5వేలు ఉంటే, ప్రస్తుత మార్కెట్ రేటుతో సంబంధం లేకుండా కంపెనీ అంతే చెల్లించేది. రైతులు.. కంపెనీలను ఆశ్రయించకుండా సొంతంగా దళారులతో విత్తనాన్ని కొనుగోలు చేసి, పొలంలో విత్తుకున్నాడు. దీంతో ఆయా కంపెనీల ప్రతినిధులు.. రైతులు పండించిన సీడ్ కల్తీదనీ, అందుకే కొనుగోలు చేయట్లేదని ప్రచారం చేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్ కావడంతో ఒక్క హావళిగి గ్రామంలోనే దాదాపుగా 40 వేల క్వింటాళ్ల విత్తన జొన్న నిల్వ ఉంది. పండించిన పంట అమ్ముడుపోక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు నరక యాతన అనుభవిస్తున్నారు.

విత్తన జొన్న మంచిదే..



హావళిగిలో రైతులు పండించిన విత్తన జొన్న మంచిదే. కంపెనీలతో రైతులు అగ్రిమెంట్లు చేసుకోకపోవడంతో వారు పండించిన పంటను కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం విత్తన జొన్నను కొనుగోలు చేయదు. రాయచూరు జొన్నలు మాత్రమే సేకరిస్తుంది. రైతులు పండించిన విత్తన జొన్నను మార్కెట్లకు తీసుకెళ్లి, విక్రయించుకోవచ్చు.

- పెన్నయ్య, మండల వ్యవసాయాధికారి, విడపనకల్లు

జొన్నలు మెత్తబడిపోతున్నాయి



ఆరెకరాల్లో విత్తన జొన్నను సాగు చేశా. వంద బస్తాల దిగుబడి వచ్చింది. ఇంట్లో నిల్వ చేసేందుకు స్థలం లేక పక్కింటి రైతు వామిదొడ్డిలో ఉంచా. ఎండలకు జొన్నలు మెత్తబడిపోతున్నాయి. దళారులు క్వింటా రూ.3వేలకు అడుగుతున్నారు. ఆ ధరకు విక్రయిస్తే రూ.30వేల వరకు నష్టం వస్తుంది.

-కణేకల్లు ఓబులేసు, రైతు, హావళిగి

నష్టానికి అమ్ముకుంటే అప్పులు ఎలా కట్టాలి?



20 ఎకరాలు కౌలుకు తీసుకుని, విత్తన జొన్నను సాగు చేశా. 600 బస్తాలు దిగుబడి వచ్చింది. ఇంటి వద్ద స్థలం లేకపోవడంతో పొలంలోనే నిల్వ చేశారు. రాత్రి సమయంలో కాపలాగా వెళ్తున్నాం. విక్రయిద్దామంటే వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. నష్టానికి అమ్ముకుంటే అప్పులు ఎలా తీర్చుకోవాలో తెలియటం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- సక్కీరప్ప, రైతు, హావళిగి



నిప్పుతో ముప్పు..!

ఎండుతున్న పచ్చికబయళ్లు
అగ్నికి ఆహుతవుతున్న తోటలు
ఆందోళనలో అన్నదాతలు


మామిళ్లపల్లి వద్ద మంటలను ఆర్పేందుకు వచ్చిన ఫైరింజన్


మామిళ్లపల్లి వద్ద మంటలకు కాలిపోయిన శ్రీగంధం మొక్కలు

కనగానపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం రాకనే ఎండలు మండిపోతున్నాయి. పచ్చని గడ్డి ఎండుబారుతోంది. ప్రమాదశాత్తు నిప్పంటుకుని పచ్చని పంటలు అగ్నికి బూడిదవుతున్నాయి. సకాలంలో ఫైర్‌ఇంజన్లు ప్రమాద స్థలానికి రాకపోవడంతో మంటలు వేగంగా వ్యాపించి చీనీ, అరటి, అనప, శ్రీగంధం చెట్లు కాలిపోయి రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల మండలంలో అగ్ని ప్రమాదాలు జరిగి పలు పంటలు, డ్రిప్పు పరికరాలు బూడిదయ్యి లక్షల్లో నష్టపోయారు. చంద్రాచర్ల గ్రామానికి చెందిన రైతు రాయపాటి శ్రీరాములుకు చెందిన జామతోట కాలిపోయి రూ.4 లక్షలు నష్టపోయాడు. మామిళ్లపల్లి భరత్‌రెడ్డికి చెంది శ్రీగంధం చెట్లు, అదే గ్రామంలోని నాగప్పకు చెందిన అనపతోట కాలిబూడిదవడంతో తీవ్రంగా నష్టపోయారు. తోటల పరిసరాలు ఎండుగడ్డి ఉండటంతో బాటసారులు, అకతాయిలు నిప్పుపెట్టడంతో ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది.

డివిజన్‌కు ఒకే ఫైర్‌స్టేషన్

ధర్మవరం డివిజన్‌కు సంబంధించి ఫైర్‌స్టేషన్ ఒక్కటే ఉండటంతో సకాలంలో ప్రమాదస్థలికి అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేకపోతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ధర్మవరం నుంచి కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు సకాలంలో వెళ్లలేకపోతున్నాయి. అటవీశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టక పోవడంతో కొండలు మంటలకు కాలిపోతున్నాయి. దీంతో పచ్చని చెట్లతో పాటు వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి.

మానవ తప్పిదంతోనే...

మానవ తప్పిదంతోనే అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదం వల్ల పండ్లతోటలు కాలిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఇందుకు ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం చెల్లించదు. రైతులు తమ పొలాల చుట్టూ ట్రెంచులు ఏర్పాటు చేసుకోవడం, చెట్ల మధ్య ఎండు గడ్డి లేకుండా కలుపు తొలగించుకోవడం వల్ల నష్ట తీవ్రతను కొంచెమన్నా తగ్గించుకోవచ్చు.

-అమరేశ్వరి, ఉద్యానశాఖ అధికారి


దాదులూరు వద్ద అగ్నికి కమిలిపోయిన జామతోట


మామిళ్లపల్లి వద్ద చీనీతోట సమీపంలో ఎండు గడ్డి



అసంపూర్తిగా హెచ్చెల్సీ భవనాలు


అసంపూర్తిగా నిలిచి పోయిన హెచ్చెల్సీ క్వార్టర్స్

శిథిలావస్థలో కార్యాలయాలు

అతిథి గృహంలో సిబ్బంది విధులు

కూటమి ప్రభుత్వంలో అయినా పూర్తయ్యేనా..?

కణేకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీకి ప్రధాన సబ్‌డివిజన్‌గా ఉన్న కణేకల్లులో హెచ్చెల్సీ భవనాలన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో అధికారులు పరిపాలన సాగించడానికి అనేక అగచాట్లు పడాల్సి వస్తోంది. పాత భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల అధికారులు హెచ్చెల్సీ అతిథిగృహంలోకి కార్యాలయాన్ని మార్చారు. అది కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు విధులు నిర్వహించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. 2009లో ఆధునికీకరణలో భాగంగా నాల్గవ ప్యాకేజీలో హెచ్చెల్సీ కార్యాలయంతో పాటు అధికారుల క్వార్టర్స్ నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేసింది. దీంతో అప్పటి కాంట్రాక్టర్లు ప్రధాన హెచ్చెల్సీ సబ్ డివిజన్ కార్యాలయాన్ని దాదాపు 80 శాతం మేర నిర్మించారు. అలాగే సిబ్బంది నివాసం ఉండేందుకు అవసరమైన క్వార్టర్స్‌లో ఒక దాన్ని నిర్మించగా మరికొన్ని పునాదిస్థాయిలో నిలిచిపోయాయి. నిధులు రాకపోవడంతో అవి అసంపూర్తిగా నిలిచిపోయాయి.


అర్ధంతరంగా ఆగిన హెచ్చెల్సీ కార్యాలయం

అధికారులకు తీవ్ర ఇబ్బందులు

హెచ్చెల్సీ సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఈఈ, నలుగురు జేఈఈలు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌తో పాటు వాచ్‌మెన్‌లు, కార్యాలయ సిబ్బందితో పాటు లస్కర్లు కూడా ఉన్నారు. భవనాలు లేకపోవడంతో గతంలో అధికారులు చిన్నపాటి గదుల్లో పాలన సాగించేవారు. దాదాపు 25 కి.మీ. మేర సబ్ డివిజన్ కలిగి ఉన్న కణేకల్లుకు అనేక రికార్డులు, భూములు, నీటి సరఫరా వివరాల రికార్డులు ఉంటాయి. వాటన్నింటిని భద్రపరిచేందుకు గదులు లేక అధికారులు కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం హెచ్చెల్సీపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇటీవలే హెచ్చెల్సీలోని పలు మరమ్మతుల కోసం రూ. 36 కోట్ల నిధులు మంజూరు చేసింది. అర్ధంతరంగా ఉన్న భవనాలను పూర్తి చేయాలని అధికారులు ఆశిస్తున్నారు.

పూర్తి చేస్తే బాగుంటుంది..



హెచ్చెల్సీ సబ్‌డివిజన్ కార్యాలయం దాదాపు 80 శాతం పూర్తయింది. ఫ్లోరింగ్, పర్నిచర్, కిటికీలు, వాకిళ్లు, లైటింగ్ వంటి 20 శాతం పనులు నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేస్తే విధులు నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుంది. హెచ్చెల్సీ సబ్‌డివిజన్‌కు భవనం లేక అతిథిగృహంలో కూర్చుని విధులు నిర్వహిస్తున్నాం. **- మద్దిలేటి, హెచ్చెల్సీ డీఈఈ, కణేకల్లు**

చూసిన కనులదే భాగ్యము..

- నేడు కొండమీదరాయుడి బ్రహ్మరథోత్సవం
- ఉదయం 11:30 గంటలకు మడుగుతేరు


ముస్తాబైన రథం




కొండ మీదరాయుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ కొండమీదరాయుడు స్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించనున్నారు. కొండమీదరాయ స్వామి వైభవాన్ని కనులారా చూసి తరించేందుకు భక్తుల పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ అధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి బ్రహోత్సవాల ఏడోరోజు మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీవారు బ్రహ్మరథంపై విహరిస్తారు. ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు మడుగు తేరు లాగుతారు. వేకువజామున స్వామి వారికి భూదేవి, శ్రీదేవి అమ్మవార్లతో కల్యాణం జరిపిస్తారు. అనంతరం స్థానిక లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం నుంచి స్వామివారిని పల్లకి సేవలో రథోత్సవం వద్దకు తీసుకొస్తారు. ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేసి, తేరును లాగాతారు. ఉదయం మడుగు తేరును స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయం వద్దకు లాగుతారు. సాయంత్రం 4.30కి ఆంజనేయస్వామి ఆలయం నుంచి బ్రాహ్మణ వీధి వరకు లాగి, తిరిగి యథాస్థానానికి చేరుస్తారు.

నేడు దేవరకొండపై అఖండ జ్యోతి

శబరిమల, అరుణాచలం తరహాలో ఏటా మాఘ పౌర్ణమి రోజున దేవరకొండపై అఖండ జ్యోతిని వెలిగించనున్నారు. ఆ మేరకు అఖండ జ్యోతి స్తూపాన్ని నిర్మించారు. రథోత్సవం అనంతరం సాయంత్రం 6.45 గంటలకు దేవరకొండపై అఖండజ్యోతి వెలిగిస్తారు. ఇందుకు 200 కిలోల నెయ్యిని వినియోగించనున్నారు.


నూతనంగా నిర్మించిన అఖండ జ్యోతి స్తూపం


గజవాహనంపై విహరిస్తున్న కొండమీదరాయుడు

శ్వేత గజవాహనంపై దేవదేవుడి వైభవం

కొండమీదరాయుడి బ్రహోత్సవాల్లో భాగంగా దేవదేవుడు శ్వేత గజవాహనంపై మంగళవారం విహరించారు. ఐశ్వర్యానికి ప్రతీక అయిన ఏనుగుపై కొలువుదీరి శ్రీవారు.. భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, చిన్నరథంపై పురవీధుల్లో ఊరేగించారు. గజవాహన సేవ బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది.

బెదిరిస్తే.. సహించం

- కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం
- ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు


కార్యాలయ ఆవరణలో సంఘం నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పనుల కోసం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)ని బెదిరిస్తే సహించేది లేదని ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి అనంతపురం డీఈఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అనంతపురంలోని పాత డీఈఓ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో సమావేశమయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంకుమార్ మాట్లాడుతూ... కొంతమంది టీచర్లు, ఎంఈఓలు.. సొంత పనుల కోసం డీఈఓ ప్రసాద్ బాబుపై బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. కులసంఘాల పేరుతో తాము చెప్పిన వారికి పోస్టింగ్ ఇవ్వలేదంటూ డీఈఓను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేశ్వర్‌రెడ్డి, సహాధ్యక్షుడు పార్థసారథి, నాయకులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీకి నీరు బంద్


సరిహద్దు వద్ద హెచ్చెల్సీలో తగ్గిన నీరు

రాయదుర్గం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి జిల్లాకు అందుతున్న జలాలు మంగళవారం ఉదయం నుంచి ఆంధ్రా సరిహద్దులో తగ్గుముఖం పట్టాయి. సాయంత్రానికి సరిహద్దులో నీటిమట్టం పూర్తిగా పడిపోయింది. తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి కోటా పూర్తవడంతో సరఫరాను సోమవారం రాత్రి నుంచి బోర్డు అధికారులు నిలిపివేశారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ కోటాగా 30.354 టీఎంసీల జలాలు అందాయి. జిల్లాకు తాగునీటి అవసరాల కోసం మూడు టీఎంసీలను కేసీ కెనాల్ కేటాయింపుల నుంచి హెచ్చెల్సీకి మళ్లించారు. జిల్లాకు ఈ ఏడాది మొత్తంగా 33.354 టీఎంసీల జలాలు హెచ్చెల్సీ నుంచి అందాయి. గతేడాది జూలై 24వ తేదీ నుంచి హెచ్చెల్సీకి నీరు విడుదల చేయగా.. ఫిబ్రవరి 10వ తేదీ వరకు కాలువలో నీటి ప్రవాహం నిరంతరాయంగా కొనసాగింది. కర్ణాటక, ఆంధ్ర నీటి వాటాను కలిపి సరిహద్దులోని 105 కి.మీ. వరకు తీసుకున్నారు. కర్ణాటక వాటా త్వరగా ముగిసిపోవడంతో డిసెంబరు, జనవరి నెలల్లో ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిని కర్ణాటక అవలంబించింది. తద్వారా ఆంధ్ర వాటా నీరు మాత్రం సింగిల్ ఇండెంట్ కింద నిరంతరాయంగా తీసుకోవడంతో ఈ ఏడాది కొంత ప్రవాహ నష్టాన్ని భరించాల్సి వచ్చింది. అయినా గతంతో పోల్చితే ఈ ఏడాది జలాలు ఆశించినస్థాయి కంటే ఎక్కువగానే అందాయి. ఎగువన వర్షాలు సమృద్ధిగా కురవడంతో నీటి కొరత ఏర్పడలేదు. జలాశయం 19వ నంబరు క్రస్ట్‌గేట్ ఊడిపోయినప్పటికీ దీని ప్రభావం ఏమాత్రం హెచ్చెల్సీ వాటాపై పడలేదు. కొంతవరకు ఆందోళన కలిగించినా వర్షాలు కురిసి జలాశయం నిండడంతో కోటా నీరు పూర్తిగా అందింది. అంతరాయం ఏర్పడకుండా సరఫరా చేసుకోగలిగారు. ఖరీఫ్‌కు నీటి కొరత రాకుండా మెండుగా జలాలు అందాయి. జిల్లాలోని పీఏబీఆర్‌లో 3.650 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 1.221 టీఎంసీలు, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 8.00 టీఎంసీలు, మైలవరంలో 2.80 టీఎంసీలు, చాగల్లులో 0.802 టీఎంసీలు, పెండేకల్లులో 0.267 టీఎంసీలు, కణేకల్లు చెరువులో 0.325 టీఎంసీల నీరు నిల్వ ఉంది. హెచ్చెల్సీ ద్వారా అందిన జలాలను తాగునీటి అవసరాల కోసం ఆయా రిజర్వాయర్ల నిల్వ చేశారు. 195 రోజులపాటు హెచ్చెల్సీలో నీటిని జలాశయం నుంచి తీసుకుని జిల్లాలో తాగు, సాగునీటి సమస్య లేకుండా ఈ ఏడాది అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లారు. తుంగభద్ర జలాశయంలో కూడా ఈ ఏడాది ఇప్పటివరకు 45.787 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది తొమ్మిది టీఎంసీలు మాత్రమే నిల్వ ఉండేది. నీటి లెక్కల ప్రకారం తాగునీటి అవసరాల కోసం మరికొన్ని జలాలను మళ్లించుకునేందుకు జలాశయంలో లెవల్ కూడా అనుమతించే పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు.. ఆయా రాష్ట్రాలకు సంబంధించిన నీటిలో మిగులు జలాలు ఉంటే వాటిని హెచ్చెల్సీకి మళ్లించుకుని తాగునీటి అవసరాల కోసం నిల్వ చేసుకునేందుకు ప్రయత్నాలు చేసుకున్నా లాభదాయకంగా ఉంటుంది. చివరకు ఈ ఏడాది హెచ్చెల్సీ ద్వారా అందిన జలాలు సంతృప్తిని కలిగించాయని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది.

అర్బన్‌లో 2,283 మందికి ఎన్టీఆర్ గృహాలు

గ్రామీణ ప్రాంతాల్లో నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి: హౌసింగ్ పీడీ శైలజ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ హౌసింగ్ కింద మున్సిపాలిటీల్లోని 2,283 ఇళ్లకు ప్రతిపాదనలు పంపినట్లు హౌసింగ్ పీడీ శైలజ మంగళవారం తెలిపారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమె.. ఎండీ కార్యాలయానికి పంపారు. ఇందులో అనంతపురం 613, గుంతకల్లు 535, కళ్యాణదుర్గం 263, రాయదుర్గం 243, తాడిపత్రి 429, గుత్తి 200 మొత్తం 2,283 ఇళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జాబితాలను ఇంజనీర్ల ద్వారా రాజధాని అమరావతికి అప్రూవల్ కోసం పంపారు. ఈ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష, లబ్ధిదారుడి వాటా రూ.2లక్షలతో మొత్తం రూ.4.5 లక్షల యూనిట్ ధరను ప్రభుత్వం నిర్ణయించినట్లు పీడీ తెలిపారు. సొంత స్థలం ఉన్న వారికి మాత్రమే అర్బన్ హౌసింగ్ మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు.


ప్రతిపాదనలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ శైలజ

నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి

సొంత స్థలం ఉన్నవారు నెలాఖరులోపు ఆయా గ్రామ సచివాలయాల్లో పీఎంఏవై-ఎన్టీఆర్ హౌసింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ శైలజ తెలిపారు. వారి జాబితాను ఆయా ఎంపీడీఓలు, తహసీల్దార్లు, హౌసింగ్ ఏఈలు సభ్యులుగా ఉండే బృందం పరిశీలించి, పీడీ కార్యాలయానికి పంపుతారన్నారు. సొంత స్థలం కలిగిన అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పీడీ సూచించారు.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6వేలు, సరాసరి రూ. 16,320 తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 32 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



క్రైం కార్నర్

బతుకు ముగించారు..

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య


కళ్యాణి (ఫైల్)

ముదిగుబ్బ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వేదనను భరించలేక బతుకు ముగించారు. జిల్లాలో వేర్వేరుచోట్ల ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మండలంలోని ఎస్. బ్రాహ్మణపల్లికి చెందిన కళ్యాణి (35) సోమవారం రాత్రి బావిలో పడి ప్రాణం తీసుకుంది. ముదిగుబ్బ సీఐ శివ రాముడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళ్యాణికి మల్లి కార్జునతో వివాహమైంది. మల్లికార్జున గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు. వారిలో ఒకరు క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. కళ్యాణి కూడా మూర్ఛ వ్యాధితో సతమతమవుతుండేది. ఈ పరి ణామాలతో తీవ్ర మనస్తాపం చెందిన కళ్యాణి చనిపోతానంటూ కుటుంబ సభ్యులతో తరచూ చెబుతుండేది. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి ఊరి చివర బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి నారాయణస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భార్య కాపురానికి రాలేదని..


గంగాద్రి (ఫైల్)

తనకల్లు: భార్య కాపురానికి రాలేదన్న మనస్తాపంతో మండలంలోని బొంతపల్లికి చెందిన గంగాద్రి (22) సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగాద్రికి కర్ణాటకలోని శివపురం గ్రామానికి చెందిన రక్షితతో వివాహమైంది. వారికి రెండేళ్ల కుమారుడు ప్రణీత్ ఉన్నాడు. రెండేళ్లుగా రక్షిత పుట్టింట్లోనే ఉంటోంది. దీంతో గంగాద్రి తీవ్ర మనస్తాపం చెందాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని, మరణించాడు. ఉదయాన్నే గమనించిన కుటుంబీకులు బోరుమన్నారు. గంగాద్రి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని కదిరి ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో సెంట్రింగ్ కార్మికుడు..


శ్రీధర్‌నాయక్ (ఫైల్)

ధర్మవరంరూరల్: మండలంలోని ఓబుళనాయునిపల్లి ఎగువతండాలో అప్పుల బాధతో సెంట్రింగ్ కార్మికుడు శ్రీధర్‌నాయక్(25) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణస్వామినాయక్, లక్ష్మీదేవిబాయి దంపతుల కుమారుడు శ్రీధర్‌నాయక్ సెంట్రింగ్ పనులకు వెళ్తుండేవాడు. రెండేళ్ల క్రితం తల్లిదండ్రులు మృతి చెందడంతో శ్రీధర్‌నాయక్ కుంగిపోయాడు. ఉన్న ఒక సోదరుడు బెంగళూరులో నివసిస్తున్నాడు. శ్రీధర్‌నాయక్ ఒక్కడే ఊరిలో ఉండేవాడు. రోజూ సెంట్రింగ్ పనులు చేసుకుని, గ్రామానికి చేరుకునేవాడు. పనులకు వస్తానని చెప్పి పలువురి వద్ద అడ్వాన్సుల కింద రూ.2లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక ఆవేదన చెందుతుండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది సోమవారం రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం 8 గంటలైనా ఇంటి తలుపులు తీయకపోవడంతో స్థానికులు గమనించారు. తలుపులు పగులగొట్టి చూడగా.. ఉరికి వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కిలో గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న సీఐ

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షికారి కాలనీలో కిలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న షికారి నాగరాజును అరెస్టు చేశారు. స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గంజాయి పట్టివేత వివరాలను సీఐ మనోహర్ వెల్లడించారు. షికారి కాలనీకి చెందిన నాగరాజు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు వెళ్లి అక్కడ రైల్వే ప్లాట్‌ఫాంలో కిలో గంజాయి కొనగోలు చేసి, గుంతకల్లుకు తీసుకొచ్చాడు. చిన్న చిన్న ప్యాకెట్లలో నింపి, ఒక్కొక్కటి రూ.150 చొప్పున విక్రయిస్తున్నాడు. కాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. షికారి నాగరాజును అరెస్టు చేసి, అతడి నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ.. నగల అపహరణ

కుందుర్పి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లికి చెందిన పుట్టమ్మ ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. పుట్టమ్మ కుటుంబ సభ్యులంతా జీవనోపాధి కోసం బెంగళూరు వెళ్లారు. ఆమె ఒక్కరే ఇంటి వద్ద ఉంటోంది. భోజనం చేసుకుని, సమీప బంధువుల ఇంటికెళ్లి రాత్రికి బస చేసి, ఉదయమే ఇంటికెళ్తుంది. సోమవారం రాత్రి కూడా ఇంటికి తాళం వేసుకుని, బంధువుల ఇంటికెళ్లింది. అర్ధరాత్రి సమయంలో దొంగలు వెనుక వైపున కిటికీ ఇనుప కడ్డీలను ధ్వంసం చేసి, లోపలికి చొరబడ్డారు. కప్‌బోర్డులోని దుస్తులను చిందరవందర చేసి, అందులోని రూ.1.50 లక్షల విలువ చేసే కమ్మలు ఇతరత్రా ఆభరణాలు అపహరించారు. దీనిపై బాధితురాలు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీనిపై విచారిస్తున్నట్లు ఎస్ఐ నగేశ్ తెలిపారు.

చెప్పుల షాపు యజమానిపై దొంగల దాడి

● రూ.2.40 లక్షల అపహరణ

కుందుర్పి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిజవల్లి గ్రామానికి చెందిన సికిందర్ అనే చెప్పుల వ్యాపారిపై సోమవారం రాత్రి దొంగలు దాడి చేసిరూ. 2.40 లక్షలు దోచుకెళ్లినట్లు బాధితుడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలో చెప్పుల వ్యాపారంతో పాటు పేటీఎం నగదు లావాదేవీలను చేస్తుంటాడు. రోజూలాగే వ్యాపారం ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా.. బండిమీదపల్లి-నిజవల్లి గ్రామాల మధ్య దొంగలు దాడి చేసి కళ్లల్లో కారంకొట్టి తన వద్ద ఉన్న 2.40 లక్షలు ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు. అనంతరం ఈ విషయంపై గ్రామస్థులకు సమాచారం అందించాడు. వారు అక్కడికి చేరుకునే సరికి దొంగలు పరారైపోయారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 525 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల సత్తా


ఓం కిరణ్ (కదిరి)


నారాయణ విద్యార్థులను అభినందిస్తున్న కోర్ డీన్, డీజీఎం


అనంతపురం విద్య, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షల ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచారు. జనవరి 22 నుంచి 29 వరకూ నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షల ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) మంగళవారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించారు.

నారాయణ విద్యార్థుల సత్తా

నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో చదువుతున్న భూపతి నితిన్ అగ్నిహోత్రి 300 మార్కులకు 290 మార్కులు పొంది 99.997 పర్సంటైల్ సాధించాడు. మహమ్మద్ ఆసిఫ్ 99.48 పర్సంటైల్, భావన 99.43 పర్సంటైల్, విశాల్ 99.36 పర్సంటైల్ సాధించారు. దీంతో విద్యార్థులను నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ బద్రీనాథ్, డీజీఎం వెంకట్రామిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... భూపతి నితిన్ అగ్నిహోత్రి అత్యుత్తమ పర్సంటైల్‌తో రాయలసీమ జిల్లాల్లోనే ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. తమ విద్యార్థులు 99 పర్సంటైల్ నలుగురు విద్యార్థులకు కాగా 98 పర్సంటైల్ పైన 7 మంది విద్యార్థులకు, 97 పర్సంటైల్ పైన 12 మందికి, 94 పైన 18 మందికి వచ్చాయన్నారు.

కదిరి విద్యార్థి ప్రతిభ

కదిరిఅర్బన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కదిరి విద్యార్థి ఓం. కిరణ్ 99.9107 పర్సెంటైల్‌తో ప్రతిభ చాటారు. పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు ఓబులపతి, పుష్పావతి దంపతుల కుమారుడు ఓం. కిరణ్. హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో చదువుతున్న ఇతను ఓబీసీ కేటగిరిలో ప్రతిభ చాటాడు.


కౌశిక్ నాయుడు (కొత్తచెరువు)

కొత్తచెరువు విద్యార్థికి 99.75 పర్సెంటైల్

కొత్తచెరువు: మండల కేంద్రానికి చెందిన కౌశిక్‌నాయుడు జేఈఈ మెయిన్స్ ఫస్ట్ సెషన్స్‌లో 99.75 పర్సెంటైల్ సాధించాడు. విజయవాడలోని మయూరి భవన్-1 క్యాంపస్‌లో కౌశిక్ నాయుడు ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని తల్లిదండ్రులు పురుషోత్తం, గీత తెలిపారు.

సౌభాగ్యం వద్దనుకుని..!

భర్తను హత్య చేయించిన భార్య

● వివాహేతర సంబంధంతో దారుణం
● హత్య కేసును ఛేదించిన పోలీసులు
● ముగ్గురు నిందితుల అరెస్ట్


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేఖర్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంతోనే మహిళ తన భర్తను హత్య చేయించినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతపురం నగర శివారులోని చింతతోపులో ఈనెల రెండో తేదీన జరిగిన హత్య కేసును అనంతపురం రూరల్ పోలీసులు ఛేదించారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన దేవరకొండ కాశప్ప హత్య కేసులో అతడి భార్య దేవరకొండ సౌభాగ్య, కర్ణాటక రాష్ట్రం కోలార్ సమీపంలోని బంగారుపేట్‌కు చెందిన నవాజ్‌బేగ్, కోలార్ పట్టణానికి చెందిన గౌస్‌పీర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ రాంబాబుతో కలిసి సీఐ శేఖర్ అరెస్ట్ వివరాలు వెల్లడించారు.

టమోటా మండీలో గొడవతో...

దేవరకొండ కాశప్ప అలియాస్ కాశి, అతడి భార్య సౌభాగ్య కక్కలపల్లి టమోటా మండీలో కూలీలతో మేస్త్రీ పని చేయించి తిరిగి గ్రామానికి వెళ్లేవారు. కాశప్ప మూడు నెలల కిందట తన పొలం అమ్మగా వచ్చిన డబ్బు తీసుకుని చీరల వ్యాపారం చేయడానికి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉండి పోయాడు. అతడి భార్య సౌభాగ్య మాత్రం రోజూ వచ్చి పనులు చేయించి వెళ్లేది. ఈ క్రమంలో రెండు నెలల కిందట కర్ణాటక రాష్ట్రం కోలార్‌కు చెందిన నవాజ్‌బేగ్, గౌస్‌పీర్‌లు సౌభాగ్య దగ్గర పనికి చేరారు. ఈ క్రమంలో సౌభాగ్య, నవాజ్‌బేగ్ మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. వారిద్దరి వ్యవహారం టమోటా మండీ మొత్తం తెలిసిపోయింది. ఈ విషయం కాశప్పకు కూడా తెలియడంతో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో ఇద్దరినీ చంపుతానని హెచ్చరించాడు. దీంతో తమ తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను తొలగించుకుంటే ప్రియుడితో హాయిగా ఉండొచ్చని సౌభాగ్య భావించింది. నవాజ్‌తో చర్చించి, గౌస్‌తో కలిసి భర్తను హత్య చేయాలని కోరింది. ఈనెల 1వతేదీ స్థానిక కియ మోటార్స్ ఎదురుగా ఉన్న చింతతోపులోకి కాశప్పను నవాజ్, గౌస్ నమ్మించి తీసుకెళ్లారు. అక్కడ మద్యం తాగించారు. ఆమత్తులో ఉండగానే ఖాళీ బీరు బాటిల్, బండరాయితో మోది హత్య చేశారు. ఎవరికీ అనుమానం కలగకుండా ఉండేందుకు సౌభాగ్య స్థానిక పోలీసులకు తన భర్తను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని ఈనెల మూడో తేదీ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రూరల్ డీఎస్పీ వెంకటేశులు ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసు ఛేదించారు. సీఐ శేఖర్‌కు సమాచారం అందడంతో స్థానిక ఆర్టీటీ స్టేడియం సమీపంలో ఎస్ఐ రాంబాబు, సిబ్బందితో కలిసి ఈ ముగ్గురిని అరెస్ట్ చేశారు.

రేపటి నుంచి సేవాఘడ్ ఉత్సవాలు

ఏర్పాట్లు పూర్తి



గుత్తిరూరల్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): సంత్‌సేవాలాల్ జయంత్యుత్సవాలు గురువారం నుంచి సేవాఘడ్‌లో ప్రారంభంకానున్నాయి. సంత్‌సేవాలాల్ 286 సంవత్సరాల కిందట జన్మించి ఎన్నో మహిమలను చూపి, సుగాలీ జాతి జాగృతి కోసం ఆరాటపడిన మహోన్నత వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఈక్రమంలోనే దేశంలోని బంజారాల చేత పూజింపబడుతున్నారు. అలాంటి మహనీయుడి జన్మస్థానం గుత్తి మండలంలోని సేవాఘడ్. ఎన్నో పరిశోధనల అనంతరం 25 ఏళ్ల కిందట చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓ గ్రామ శిథిలాల ఆధారంగా సేవారాజ్ మహరాజ్ గ్రామం సేవాలాల్ స్వగ్రామంగా గుర్తించారు. దానికి సేవాఘడ్ అని నామకరణం చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బంజారా ట్రస్టు ఆధ్వర్యంలో 14, 15 తేదీలలో జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తూ వస్తోంది. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లపై ఇప్పటికే అధికారులతో సమీక్షించారు. భక్తుల కోసం చేపట్టాల్సిన సౌకర్యాలపై పలు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.


సేవాలాల్ మహరాజ్ మూలవిరాట్టు


మాతా జగదాంబ


గుత్తికోట ఆధారంగా గుర్తింపు

బంజారాల ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో అన్వేషణ సాగించి గుత్తి కోట ఆధారంగా సేవాలాల్ జన్మస్థలాన్ని గుర్తించారు. 2000వ సంవత్సరం నుంచి సేవాలాల్ జయంతి వేడుకలను సేవాఘడ్‌లో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిదేళ్ల కిందట రూ.1.20 కోట్లతో మాతా జగదాంబ ఆలయాన్ని నిర్మించారు. ఉత్సవాల సందర్భంగా ఈ ఆలయంలో 2016లో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవాలకు ఇతర రాష్ట్రాల నుంచి బంజారాలు పెద్ద సంఖ్యలో వస్తారు. రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ ఏడాది కూడా దేశ వ్యాప్తంగా బంజారాలు సేవాఘడ్‌కు రానున్నారు.

అనంతలో అగ్రిస్టాక్ ప్రారంభం

● రైతులకు 11 అంకెల యూనిక్ నంబర్ల కేటాయింపు
● నెలాఖరు వరకు పీఎం కిసాన్ లబ్ధిదారులకు గడువు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అగ్రి స్టాక్ (ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్) రైతుల వివరాల నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభమయింది. రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా అగ్రిస్టాక్‌లో రైతుల వివరాలను రిజిస్ట్రేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు అధికారికంగా ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి రిజిస్ట్రేషన్ చేయడంపై శిక్షణనిచ్చారు. ఆర్ఎస్‌కే సిబ్బంది తమ లాగిన్ ద్వారా రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. జిల్లాలో మూడు లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. రైతులు ఆధార్, పట్టాదారుల పుస్తకం, ఆధార్‌తో లింకైన సెల్ నెంబర్‌ను రైతు సేవా కేంద్రాలకు తీసుకువెళ్లాలి. అక్కడి సిబ్బంది అగ్రి స్టాక్ వెబ్ సైట్‌లో రైతుల వివరాలతో రిజిస్ట్రేషన్ చేస్తారు. తొలుత ఆధార్ వెరిఫికేషన్ కోసం ఒక ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత మొబైల్ వెరిఫికేషన్ కోసం మరో ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత ఈ సైన్ కోసం మరో ఓటీపీ అడుగుతుంది. మూడు ఓటీపీలు పూర్తయిన తర్వాత రిజిస్ట్రేషన్ విజయవంతమయినట్లు రైతు సెల్ నెంబర్‌కు మరో సంక్షిప్త సమాచారం వెళుతుంది. ఆ మెసేజ్ వచ్చిన 48 గంటల తర్వాత 11 నెంబర్లతో కూడిన యూనిక్ నెంబర్ మెసెజ్ ద్వారా వస్తుంది. ప్రజలకు ఆధార్ ఎంత ముఖ్యమో రైతులకు (ఫార్మర్ రిజిస్ట్రేషన్ నెంబర్) ఈ యూనిక్ నంబర్ అంతే ముఖ్యం. భవిష్యత్‌లో రైతులకు సంబంధించిన అన్ని పథకాలు ఈ నెంబర్ ఆధారంగానే వర్తింపజేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది.



ఆన్‌లైన్‌లో అగ్రిస్టాక్ వెబ్‌సైట్

రైతులకు యూనిక్ నంబర్ తప్పని సరి: ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

ఫార్మర్ రిజిస్ట్రేషన్ యూనిక్ నంబర్.. రైతులకు తప్పనిసరి. జిల్లాలోని రైతులందరూ స్థానిక రైతు సేవాకేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి యూనిక్ నెంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆధార్, పట్టాదారు పుస్తకం, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్‌ను రైతులు తీసుకువెళ్లాలి. ఈనెలాఖరులోగా పీఎం కిసాన్ లబ్ధిదారులు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. భవిష్యత్‌లో ఈ నంబర్ ఆధారంగానే అన్ని రకాల లబ్ధిని ప్రభుత్వం అందించే యోచన చేస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలోని ఎంఐజీ లేఅవుట్లలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంస్థ చైర్మన్ టీసీ వరుణ్, వైస్ చైర్మన్, జేసీ శివనారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. అహుడా కార్యాలయంలో మంగళవారం అనంతపురం(కందుకూరు), కొడూరు, ధర్మవరం లేఅవుట్లపై అహుడా, పబ్లిక్‌హెల్త్ అధికారులతో వారు సమీక్షించారు. ఈ సందర్భంగా పనులపై ఆరా తీశారు. లే అవుట్లలో రోడ్లు, డ్రెయిన్లు, పార్కులు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అహుడా సెక్రటరీ గౌరీశంకర్‌రావు, ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, పబ్లిక్ హెల్త్ ఇన్‌చార్జ్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్‌చౌదరి, డీఈ రేవంత్‌కుమార్‌రెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

33 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం 33 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో భాగంగా ఆకుతోటపల్లి గ్రామంలో పెద్దన్న ఇంటి వెనుక ఖాళీ స్థలంలో ఉన్న 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీఐ సద్గురుడు ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. వీటిని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని స్థానిక బిందెలవారి కాలనీలో సీఐ జమాల్ బాషా ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. కాలనీలో గోవిందుకు చెందిన నివాసం పక్కన ఉన్న షెడ్డులో నిల్వ చేసిన 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ఆలమూరుకు చెందిన సత్రశాల సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

నీటిని విడుదల చేయాలి: సీపీఐ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ మండలంలోని మద్దిలేరు (యోగివేమన) ప్రాజెక్ట్ నుంచి చెరువులకు నీటిని విడుదల చేయాలని శ్రీసత్యసాయి జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్యయాదవ్ కోరారు. ఈమేరకు స్థానిక సప్తగిరిసర్కిల్‌లో ఉన్న మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో సీపీఐ నాయకులు ఈఈ రాముకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేమయ్య యాదవ్ మాట్లాడుతూ.. 25ఏళ్లుగా యోగివేమన ప్రాజెక్ట్ రైతులకు ఉపయోగపడడం లేదని... వెంటనే మరమ్మతులతో పటిష్టం చేసి ఉప యోగంలోకి తేవాలన్నారు. దీనికి మైక్రో ఇరిగేషన్ ఈఈ రాము స్పందిస్తూ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాటమయ్య, మహదేవ్, కె కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల పాట అజరామరం


ఘంటసాలకు నివాళులర్పిస్తున్న డీఆర్వో మలోల, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి శ్రీనివాసరెడ్డి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఘంటసాల పాట అజరామరమని జిల్లా రెవెన్యూ శాఖాధికారి మలోల, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతిని పురస్కరించుకుని పాత పాటల ప్రేమికుల సంఘం, పద్మశ్రీ ఘంటసాల సంగీత సాంస్కృతిక సేవాట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హౌసింగ్ బోర్డు రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కులోని ఘంటసాల మండపం వద్ద నిర్వహించిన సభకు వారితోపాటు హైదరాబాద్‌కు చెందిన గాయకుడు బాలకామేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంగీత విభావరిలో కళాకారులు ఘంటసాల పాటలతో అలరించారు. కార్యక్రమంలో ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, జీవీ రామయ్య, ఓబులదాస్, విజయ రాగవన్, బృంద, మహీధర్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులను విమానమెక్కిస్తా: ఎంఈఓ


మల్లారెడ్డి, ఎంఈఓ

బెళుగుప్ప, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఎంఈఓ మల్లారెడ్డి బంపర్ ఆఫర్ ప్రకటించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో 570కు పైగా మార్కులు సాధిస్తే విమాన ప్రయాణ అవకాశం కల్పిస్తానని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తన సొంత ఖర్చులతో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. బెంగళూరు నుంచి హైదరాబాద్ వరకు విమానంలో ప్రయాణించే అవకాశం కల్పిస్తామని తెలిపారు. పరీక్షల్లో మండలాన్ని అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయమని అన్నారు.

న్యూస్ బాక్స్

జిల్లాకు ఏఈఈల కేటాయింపు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి):జిల్లాకు ఏఈఈలను కేటాయిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఏఈఈలుగా పని చేస్తున్న నారాయణమ్మ, సాయిపల్లవిని జిల్లాకు కేటాయించారు. అనంతపురం టౌన్ డి-1 సెక్షన్ ఏఈఈగా నారాయణమ్మను, డి-2సెక్షన్ ఏఈఈగా సాయిపల్లవిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. టౌన్-1 సబ్‌ఇంజనీరింగ్ పనిచేస్తున్న నీలకంఠకు ఉద్యోగోన్నతి కల్పించి నార్పల ఏఈఈగా నియమించారు.

శాస్త్రవేత్తలకు చిరునామా భౌతిక శాస్త్రం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పురాతన కాలనుంచి ఆధునికం వరకు భౌతిక శాస్త్రం శాస్త్రవేత్తలకు చిరునామాగా నిలుస్తోందని కృషివిజ్ఞాన కేంద్రం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లీశ్వరి, శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ లర్నింగ్ ప్రొఫెసర్ దీపా సీతారామన్ పేర్కొన్నారు. మంగళవారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి జరీనా ఆధ్వర్యంలో వర్క్‌షాపును నిర్వహించారు. అంతర్జాతీయ ఉమెన్ ఇన్ స్టెమ్-చేంజింగ్ ది లాండ్‌స్కేప్ అనే అంశంపై ఏర్పాటుచేసిన వర్క్‌షాప్‌నకు మల్లీశ్వరి, సీతారామన్ ముఖ్య వక్తలుగా హాజరై మాట్లాడారు.

వేధింపులపై కఠిన శిక్షలు విధించాలి: సాకే హరి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజనులపై వేధింపులకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు విధిస్తేనే భవిష్యత్తులో పునరావృతం కాకుండా నిలువరించవచ్చునని ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి కోరారు. రూరల్ మండలం ఉప్పరపల్లికి విద్యార్థిని శిరీష ఆత్మ హత్యపై మంగళవారం బాధిత కుటుంబ సభ్యులతో పోలీసు అధికారులు వివరాలు సేకరించారు. సాకేహరి మాట్లాడుతూ... శిరీష ఆత్మహత్యకు కారణమైన యువకుడిని కఠినంగా శిక్షించాలన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లిలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి స్థానిక సర్పంచు శివశంకర్ మంగళవారం భూమిపూజ చేశారు. వేసవి సమీపిస్తుండటంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్త కుండా ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామంలో రూ. 15లక్షలతో 20వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

నేడు డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల పంపిణీ

రాప్తాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో బుధవారం ఉదయం 9 గంటలకు రైతులకు సబ్సిడీ డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను ఎమ్మెల్యే పరిటాల సునీత పంపిణీ చేయనున్నట్లు మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పత్రికా ప్రకటనలో తెలిపారు. రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లోని 214 మంది రైతులకు జాతీయరహదారి పక్కన బెల్లం టీకేఫ్ వద్ద పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

'రంగరాజన్‌పై దాడి దుర్మార్గం'

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): చిలుకూరి బాలాజీ దేవాలయ ప్రధానార్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి హైందవ ధర్మంపై జరిగిన దాడి అని దేవదాయ శాఖ ప్రభుత్వ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం అనంతపురంలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఘనంగా యునానీ దినోత్సవం



యునానీ దినోత్సవంలో పాల్గొన్న ఆయుష్ వైద్యులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యూనానీ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని నాలుగో రోడ్డులో ఉన్న ఆయుష్ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ సీనియర్ డాక్టర్ రఫీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఆయుష్ డాక్టర్లు లాల్యానాయక్, రామకుమార్, సిబ్బంది సుదర్శన్, మహేంద్ర, సుధాకర్, యోగా శిక్షకులు గురురాజా, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

18 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ తదితరులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేట సమీపంలోని శ్రీబాలాజీ ఎంబీఏ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 18మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. మంగళవారం కళాశాలలో హైదరబాదుకు చెందిన డీమార్ట్ కంపెనీలోని హెచ్‌ఆర్ మేనేజర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వ హించారు. ఇంటర్వ్యూలకు 250మంది విద్యార్థులు హాజరుకాగా 18మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాసన్, ప్రాంగణ నియామకల అధికారి బాబాఫక్రుద్దీన్, వహీదా, విభాగాపతి సునీల్, రాఘువేంద్ర పాల్గొన్నారు.

'టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి'

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ఆలమూరు పంచాయతీ పరిధిలో నిర్మాణ దశలో ఉన్న ఎంబీ పల్లి రోడ్డును టీడీపీ మండల నాయకులు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ, సీనియర్ నాయకులు ఆలమూరు సూరి తదితరులు గ్రామంలో పర్యటించారు. మాజీ ఎంపిటీసీ బాలు, టీడీపీ నాయకులు మురళీమోహన్, వీరాంజనేయులు, రామాంజి నేయులు, రత్నమోహన్, రామ్మోహన్, రామచంద్ర, లేపాక్షి నాయుడు, ఉమాశంకర్, గోపాల్, లక్ష్మినాయుడు, సంజీవులు, చంద్రశేఖర్ నాయుడు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

తాడిమర్రి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాడితోట వద్ద ఓ లారీ అదుపు తప్పి మంగళవారం బోల్తా పడింది. నార్పల మండలం ముచ్చుకుంటపల్లి రైతు చిన్నపరెడ్డి తన పొలంలోని 11 టన్నుల చీనీకాయలను లారీ (ఏపీ03 పీకే 0863) లో చెన్నైకు తరలించబోయాడు. దాడితోట వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయే క్రమంలో లారీ అదుపుతప్పి బోల్తా ప డింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సగానికిపైగా చీనీకాయలు దెబ్బతినడంతో తాను దాదాపు రూ.3 లక్షలు నష్టపోయానని చిన్నపరెడ్డి వాపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది.



గతంలో సోదనపల్లి రోడ్డు



ప్యాచ్ వర్క్ చేసిన తరువాత..

గ్రామీణ రోడ్లకు మోక్షం

శింగనమల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో దెబ్బతిన్న పలు గ్రామీణ రోడ్లకు కనీసం ప్యాచ్ వర్క్‌లను చేయలేదు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు. దీంతో ప్రయాణం సాఫీగా సాగుతుండడంతో ప్రయాణికులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. గత నెల 21 తేదీన 'ఈ రోడ్లకు మోక్షం ఎప్పుడో..?' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చిన విషయం విదితమే. దీనిపై కూటమి పాలకులు, అధికారులు స్పందించి మండలంలోని శింగనమల-రాచేపల్లి, గోవిందరాయుని పేట - ఈస్టు నరసాపురం, గార్లదిన్నె - శింగనమల, లోలూరు క్రాస్ - మదిరేపల్లి, కల్లూరు - తరిమెల రోడ్ల మరమ్మతులు పూర్తి చేశారు. ఆ రోడ్లపై ప్రయాణం సాఫీగా సాగుతుండడంతో ప్రజలు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కూటమితో పంచాయతీలకు పూర్వ వైభవం

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



మహిళల నుంచి అర్జీలు తీసుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పంచాయతీలకు పూర్వవైభవం వచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలో ప్రియాంకనగర్, మహ దేవనగర్‌లో 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధానంగా విద్యుత్, డ్రైనేజీ, ఇళ్ల పట్టాలు తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పలు విద్యుత్తు స్తంభాలు వంగిపోయాయని, ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల వద్ద ఉన్నాయని స్థానికులు వివరించారు. వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే విద్యుత్ అధికారులను ఆదేశించారు. త్వరలోనే అర్హులైన వారందరికీ ఇళ్లపట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకట నాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రావు, ఎంపీటీసీ రమీజాబీ, టీడీపీ నాయకులు కనుమ చౌడయ్య, డాక్టర్ హరి, తింగమయ్య స్వామి, శోభ, ధనమూర్తి, దాదాపీర్, సాధిక్‌వలి, బీజేపీ నాయకులు వెంకటేష్, బీసీ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కొండన్న, పీఎల్‌ఎన్‌మూర్తి, నాయకులు రాయల్‌మధు, రమేష్, సాకే లక్ష్మీనరసింహులు, గోపాల్‌గౌడ్, మణిరవి, ఈడిగ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు కనిపించడం లేదా..?: అనంత



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వ్యాపారులు, దళారులకు కొమ్ముకాస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తే గిట్టుబాటు ధరలు అందక రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. అయితే ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఒక్క సమీక్ష చేసే ఓపిక కూడా ప్రజాప్రతినిధులకు లేకపోవడం శోచనీయమన్నారు. పప్పుశనగ, కందులు, మొక్కజొన్న రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. వేరుశనగ రైతుల పరిస్థితి మరింత అధ్వానమన్నారు. ఫర్టిలైజర్స్, ఎరువుల దోపిడీ జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే ఎక్కడ చూసినా మద్య ంబెల్ట్‌షాపులు వెలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వేణు, శివారెడ్డి పాల్గొన్నారు.

విచారణకు దేవదాయ శాఖ ఏసీ గైర్హాజరు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చేపట్టిన విచారణకు జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్(ఏసీ) గైర్హాజరయ్యారు. సహాయ కమిషనర్ తీరును నిరసిస్తూ గత నెల 22న ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో అనంతపురంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జేసీ శివనారాయణ శర్మను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్‌ను నియమించారు. విచారణకు ఈ నెల 4వ తేదీని ఖరారు చేసినా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రభుత్వ కార్యకలాపాల్లో బిజీగా ఉండడంతో వాయిదా వేశారు. మంగళవారం విచారణకు సహాయ కమిషనర్ ఆదిశేషనాయుడు హాజరు కాలేదు. తొండపాడు తిరునాళ్ల నేపథ్యంలో గైర్హాజరైనట్లు ఆ శాఖ వర్గాల సమాచారం. విచారణ నేపథ్యంలో బాధిత అర్చకులు మంగళవారం కలెక్టరేట్ వద్ద సాయంత్రం 5 గంటల వరకు ఉండి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి వెనుదిరిగారు. ఆదిశేషనాయుడు స్థానంలో వేరొకరిని నియమించి అర్చకులకు న్యాయం చేయాలని సమాఖ్య అధ్యక్షుడు అంజనేయులు కోరారు.

టీడీపీతోనే గీత కులస్థులకు న్యాయం

●టీడీపీ ఈడిగ సాధికార సమితి సభ్యుడు గోపాల్ గౌడ్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గీత కార్మిక కులస్థులకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతోందని టీడీపీ ఈడిగ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు గోపాల్ గౌడ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గీత కార్మి కులాలకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గతంలోనే సీఎం చంద్రబాబు గీత కులాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాన్నారు. గత వైసీపీ హయాంలో గీత కులాలకు జగన్ చేసిందేమీ లేదన్నారు. రాయలసీమలో ఈడిగలను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కడంతో పాటు గీత కార్మికులపై అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు.

దుర్వినియోగమైన సొమ్ము రికవరీ చేయాలి: డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీశాఖ కార్యాలయంలోని అనంతపురం రేంజ్‌కు సంబంధించి దుర్వినియోగం అయిన సొమ్మును తప్పక తిరిగి రాబట్టాలని జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్ రేంజర్ శ్రీనివాసులును ఆదేశించారు. ఆయన మంగళవారం అటవీశాఖ జిల్లా కార్యాలయంలోని తన చాంబర్‌లో పలు విషయాలను వెల్లడించారు. సొమ్ము దుర్వినియోగం ఏడాదిన్నర కిందట బహిర్గతమైందని సంబంధిత ఫైల్‌ను పరిశీలించామన్నారు. దుర్వినియోగమైన సొమ్ము రాబట్టి ప్రజా ప్రయోజనాలకు వినియోగించేలా చూస్తామని డీఎఫ్ఓ పేర్కొన్నారు.

సంపద కేంద్రాల వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ : డీపీఓ

జిల్లాలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజ నాయుడు తెలిపారు. ఆయన మంగళవారం గుత్తి మండలంలోని సేవాఘడ్ ఉత్సవాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం చెర్లోపల్లి పంచాయతీలోని సంపద తయారి కేంద్రాన్ని పరిశీలించారు.

ప్రారంభంకాని యూనిట్లను రద్దు చేయండి

● వెంటనే కొత్త నోటిఫికేషన్ విడుదల చేయండి

● టెక్స్‌టైల్స్ పార్క్‌పై వీసీలో కలెక్టర్ ఆదేశాలు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం టెక్స్‌టైల్స్ పార్క్‌లో ఇంకా ప్రారంభంకాని 47 యూనిట్లను రద్దుచేయా లని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. పనులు ప్రాంభంకాని యూనిట్లను రద్దు చేసి ఆ స్థానంలో కొత్త నోటిఫికేషన్ జారీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయదుర్గం టెక్స్‌టైల్స్ పార్క్‌లో సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. అరవింద్ కంపెనీ వారు యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చారని, వారు కోరుకున్న చోటగానీ భూమిని కేటాయించాలని ఆదేశించారు. రద్దుచేసిన యూనిట్లను ఆసక్తిగల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేటాయించేందుకు ప్రస్తుత మార్కెట్ ధరను నిర్ణయించి దరకాస్తులు తీసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో చేనేత, జౌళి, పరిశ్రలశాఖ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): కొండమీదరాయుడు స్వామి బ్రహోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, వారి కుటుంబ సభ్యులు బండారు రవికుమార్, బండారు లీలావతి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. బుధవారం వేకుజామున జరిగే స్వామి వారి కళ్యాణోత్సవం కోసం వాటిని సమర్పించారు. నియోజకవర్గం ప్రజలు, రైతులు ఈ ఏడాది సుఖసంతోషాలుతో ఉండాలని స్వామి వారిని మొక్కుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకుడు వసుపుల శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలి: ఎమ్మెల్యే

నార్పల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు అన్ని సదుపాయాలు సమకూర్చాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఆమె మంగళవారం రాత్రి నార్పలలోని బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్‌లో కూరగాయాలు, సరుకులను పరిశీలించారు. బాత్‌రూంలు ఎన్ని ఉన్నాయి? ఇంకా కావాల్సి వస్తే వెంటనే నిర్మిస్తామన్నారు. అనంతరం విద్యార్థినులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారని వారు తెలిపారు. అలాగే పదో తరగతి విద్యార్థినులకు బోధనపై ఆరా తీశారు. వంద శాతం ఉత్తీర్ణ సాధించాలని సిబ్బందికి సూచించారు. హాస్టల్ వార్డెన్ నారాయణమ్మ, టీడీపీ నాయకులు ఆకుల అంజనేయులు, ఆకుల బాబు పాల్గొన్నారు.

పాలకేంద్రాల్లో తనిఖీలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పాల కేంద్రాలపై ఆహార భద్రత శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ్ చక్రవర్తి, ఆహార భద్రతాధికారి తస్లీమ్, ఏపీ డెయిర్ మేనేజర్ నారాయణి, ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాప్తాడులోని పరాగ్ బల్క్ మిల్క్ శీతలీకరణ కేంద్రం, హెరి టేజ్ బల్క్ మిల్క్ చిల్లింగ్ సెంటర్, అనంతపురం రూరల్ మన్నిలలోని సంగం బల్క్ మిల్క్ శీతలీకరణ కేంద్రం, ఆత్మకూరులోని శ్రీరంగ శ్రీనివాస పాల శీతలీకరణ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించారు. పాల తయారీలో అనుమానితంగా ఉన్న కేంద్రాలలోని పాల శాంపిల్స్‌ను సేకరించారు.

సర్పంచ్‌కు సన్మానం

రాప్తాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికై గత నెల 26న డిల్లీ గణతంత్ర వేడుకల్లో అవార్డు పొందిన రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు వీహెచ్‌సిబ్బంది మంగళవారం సన్మానించారు. శాలువా, బొకేలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సిండికేట్‌గా వేలం ముగింపు

● కూరగాయల మార్కెట్ వేలం రూ. 8.15 లక్షలకు..



వేలం నిర్వహిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు సిండికేట్ అయ్యారు. నగరపాలక సంస్థలో సంత, దినసరి మార్కెట్ రుసుము వసూలుచేసుకునే హక్కుకు సంబంధించి 2025-26 సంవత్సరానికి నిర్వహించిన వేలం అందుకు నిదర్శనంగా నిలిచింది. వాస్తవానికి ఈ నెల 4న వేలం నిర్వహించారు. నగరానికి చెందిన విజయ్‌కుమార్, పామిడికి చెందిన అభిలాష్, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వెంకట రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఆ సందర్భంలో రూ.88లక్షలతో వేలం ప్రారంభించగా...తమకు గిట్టుబాటు కావడం లేదని, ఆ మొత్తాన్ని తగ్గించాలని కోరారు. దీనిపై కమిషనర్ తుది నిర్ణయం తీసుకుంటారని వివరిస్తూ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు వాయిదా వేశారు. మంగళవారం కమిషనర్ బాలస్వామి ఆర్వో విజయ్‌కుమార్‌తో కలిసి బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ సారి విజయ్‌కుమార్, అభిలాష్ మాత్రమే వేలంలో పాల్గొన్నారు. సిండికేట్ వ్యవహారం నేపథ్యంలోనే రాజేంద్రప్రసాద్ హాజరు కాలేదని తెలుస్తోంది. గత ఏడాది మార్కెట్ వేలం 87.90లక్షలకు దక్కించుకున్నారని చెబుతూ కమిషనర్ ఈ సారి సర్కారు వారి పాట రూ.88లక్షలతో ప్రారంభిస్తామన్నారు. మరోసారి వేలందారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అందుకు నిరాకరిస్తూ కమిషనర్ వేలం ప్రారంభించారు. అభిలాష్ రూ.88.15లక్షలకు పాడాడు. ఇక ముందుకు సాగలేదు. అభిలాష్ ఆ మొత్తానికి వేలం దక్కించుకున్నాడు. కాగా వేలంలో వారిద్దరికి అదనంగా మరో ఇద్దరు సహాయకారులమంటూ వేలంలో పాల్గొనడం గమనార్హం.

'ఆ రెండు జీఓల రద్దు కోరుతూ పోస్టు కార్డు ఉద్యమం'

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖను నిర్వీర్యంచేసే విధంగా గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీఓలు143, 32ను రద్దుచేయాలని సీఎం చంద్రబాబుదృష్టికి తీసికెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా పోస్టుకార్డు ఉద్యమం చేపడుతున్నట్లు తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు పేర్కొన్నారు. వారు మంగళవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయం వద్ద పోస్టుకార్డులు చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం తెచ్చిన అనాలోచిత జీఓల వల్ల వైద్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. రేషనలైజేషన్ పేరుతో ఉన్నపోస్టులు రద్దుచేస్తే ప్రజలకు వైద్య సేవలు అందించడం కష్టంగా మారుతుందన్నారు. అందుకే జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు పోస్టు కార్డు ఉద్యమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఆస్పత్రిలో అసిస్టెంట్ కలెక్టర్ పరిశీలన



ఆస్పత్రిలో పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, వైద్యాధికారులు

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అసిస్టెంట్ కలెక్టర్ బొలినేని వినూత్న దృష్టి సారించారు. ఇటీవల జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. వాటిని పరిష్కరించే బాధ్యతను అసిస్టెంట్ కలెక్టర్‌కు కలెక్టర్ వినోద్‌కుమార్ అప్పగించారు. దీంతో మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ జిల్లా ఆస్పత్రికి వచ్చారు. ఆస్పత్రి ఆవరణంలో పాతబడి మూలన పడేసిన అంబులెన్స్‌లను వెంటనే తీసివేయాలని ఆదేశించారు. ఆస్పత్రి ముందుభాగంలో ప్రహరీకి ఆనుకుని ఏర్పాటు చేసుకున్న దుకాణాలను ఇంకోచోటికి తరలించి, అక్కడ వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు వైద్యాధికారులు, ఇంజినీర్లతో చర్చించారు. అలాగే కోవిడ్ సెంటర్‌కు వినియోగించిన స్థలంలో రోగుల వెంటవచ్చిన వారి విశ్రాంతి భవనం ఏర్పాటుకు పరిశీలించారు. క్యాజువాలిటీ వద్ద పరిస్థితులపై అసిస్టెంట్ కలెక్టర్ ఆరాతీశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓ డాక్టర్ రామక్రిష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ హేమలత, డాక్టర్ పద్మజ, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు.

యూరియా దోపిడీపై విచారణ షురూ..!

● ఉమ్మడి జిల్లా కలెక్టర్ల సీరియస్

● విజిలెన్స్ ఉన్నతాధికారుల ఆరా

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): యూరియా దోపిడీపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు సీరియస్ అయినట్లు సమాచారం. 'యూరియా దోపిడీ' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు స్పందించారు. దానిపై వివరణ ఇవ్వాలని ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతా ధికారులను వారు ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో లారికీ రూ.10వేలు అదనపు వసూళ్లతో పాటు క్షేత్ర స్థాయిలో అధిక ధరలకు యూరియా అమ్మకాలపై విచారించి, తగు చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మరో వైపు విజిలెన్స్ ఉన్నతాధికారులు యూరియా దోపిడీపై ఆరా తీసినట్లు సమాచారం. శ్రీ సత్యసాయి జిల్లాలో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అవసరానికి మించి యూరియా వాడకంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు సమాచారం. సీజన్‌లో ప్లాన్‌కు అదనంగా యూరియా వాడకం జరుగుతున్నా ఎందుకు అప్రమత్తం కాలేదన్న అంశాలపై విజిలెన్స్ ఉన్నతాధికారులు వ్యవసాయ శాఖ అధికారులకు లేఖ ద్వారా ప్రశ్నించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా... ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకు కొందరు కీలక అధికారులు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయినప్పటికీ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ అవుతాయన్న చర్చ ఆ శాఖలో జోరుగా సాగుతోంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అ'ధన'పు బాధ్యతలపై మంత్రి సవిత సీరియస్

● విచారణకు ఆదేశించిన రాష్ట్ర డైరెక్టర్

● విచారణాధికారిగా జేడీ శ్రీధర్‌రెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలోని బీసీ సంక్షేమశాఖలో ఇన్‌చార్జ్ వార్డెన్ల వ్యవహారంపై అ'ధన'పు బాధ్యతలు అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రధానంగా కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఆ కథనానికి రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సీరియస్ అయ్యారు. ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంలో వార్డెన్ల నుంచి కానులు దండుకోవడం, డైట్ బిల్లుల్లో పర్సంటేజీల వ్యవహారంపై ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌ను ఆరా తీశారు. ఇందుకు ఆ శాఖ డైరెక్టర్ మల్లికార్జున ఆ అధికారిపై విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా జేడీ శ్రీధర్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్ ఆదేశాల మేరకు అన్ని అంశాలపై విచారణాధికారి ఆ అధికారిపై విచారణ చేయనున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నిల గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ఈనెల 9వ తేదీన 'నిండా నిర్లక్ష్యం' అనే శీర్షికతో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఇందుకు విద్యుత్ శాఖ మండల అధికారులు స్పందించారు. ఈ క్రమం లోనే గ్రామంలోని అంజనేయస్వామి ఆలయం వెనుక భాగంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను, ముళ్ల కంపలను తొలగించారు. ఎస్సీకాలనీలో త్రీఫేజ్ లైన్ విద్యుత్ స్తంభం చుట్టు ఏపుగా పెరిగిన ముళ్ల కంపలను తొలగించారు. అదేవిధంగా ఎస్సీకాలనీలో ఒంగిపోయిన విద్యుత్ స్తంభం మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓవర్ లోడు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డీసీహెచ్ఎస్‌పై ఫిర్యాదు.. జేడీ విచారణ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య విధాన పరిషత్ (డీసీహెచ్ఎస్) శాఖాధికారి డాక్టర్ రవికుమార్‌పై వచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ విచారణ చేపట్టారు. ఆయన మంగళవారం జిల్లా కొచ్చి డీసీహెచ్ఎస్ కార్యాల యంలో విచారణ సాగించారు. డీసీహెచ్ఎస్ రవికుమార్, డీఎంఓ డాక్టర్ ఓబులు, డీసీహెచ్ఎస్ ఆఫీస్ సిబ్బంది తదితరులను పిలిపించి విచారణ చేశారు. అయితే ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ లేఖ పేరుతో ఫిర్యాదుదారుడు డీసీహెచ్ఎస్‌పై ఫిర్యాదు చేశారని, ఆయనకు తమ అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధంలేదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల అధ్యక్షులు మల్లికార్జున, రాజశేఖర్ తదితరులు విచారణాధికారికి వినతి పత్రం అందజేశారు. విచార ణాధికారి బుధవారం ఫిర్యా దుదారుడితో పాటు మరికొందరిని విచారించనున్నారు.

న్యూస్ బాక్స్

కమనీయం.. నారసింహుడి కల్యాణం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం గ్రామంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వందలాది మంది భక్తుల మధ్య కమనీయంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నాగుల కట్ట వద్ద ఏర్పాటు వద్ద లక్ష్మీసమేత నరసింహస్వామి కల్యాణం వేదమంత్రాలు, బాజబజంత్రీలతో వైభవంగా నిర్వహించారు. ఐదు జంటలకు సామూహిక వివాహం చేయించారు. వివాహాలకు మంగళసూత్రాలను పట్టణానికి చెందిన విశ్వనాథ్, వెనిగర్ గోపాల్‌రెడ్డి పేరు మీద అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బీఎన్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కార్యదర్శి గురురాఘవేంద్రప్రసాద్, కోశాధికారి సత్యనారాయణ, జీఎం నరసింహులు, సభ్యులు గురునాథ్‌రెడ్డి, రామిరెడ్డి, నరసింహులు, తిమ్మారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐ జయనాయక్, ఎస్‌ఐ బాలరాజు, సిబ్బంది శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

గజవాహనంపై రంగనాథుడు

● నేడు స్వామివారి కల్యాణం, బ్రహ్మరథోత్సవం



గుత్తిరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలో భాగంగా మంగళవారం శ్రీదేవిభూదేవి సమేతుడైన రంగనాథుడు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చారు. గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. అనంతరం చిన్న రథంపై కొలవుదీర్చి భక్తులు జమ్మిచెట్టు వరకు లాగారు. బుధవారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణోత్సవం సాయంత్రం బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈఓ రామాంజనేయులు, అర్చకులు రవిస్వామి, చేతన్‌వర్మ, లికిల్ వర్మ, రామవేంద్రచార్యులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి: మండలంలోని తొండపాడులో వెలసిన మాణిక్య, బొలికొండ రంగనాథస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్ తెలిపారు. స్వామివారి కల్యాణమండపంలో మంగళశారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.1.70 కోట్లతో నూతనంగా కొండపైకి వెళ్లడానికి మెట్లు, లక్ష్మమ్మ గుడి వద్దకు సీసీ రోడ్డు నిర్మంచామన్నారు. కొండపైన ఆలయంలో గ్రానెట్‌తో, డ్రిల్‌తో నిర్మంచామన్నారు.

బాల్యవివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీహరి

గుత్తి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అరవ అదనపు జిల్లా న్యాయాధికారి మండల లీగల్ సెల్ చైర్మన్ శ్రీహరి అన్నారు. పట్టణంలోని కోర్టు హల్‌లో మంగళవారం ఐసీడీఎస్ అధికారులు, వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 26తేదీ వరకు ఇంటింట క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. గుత్తి, పామిడి,పెద్దవడుగూరు మండలాల్లోని గ్రామాల్లో ఆశావర్కర్లు, ప్యారాలీగల్ వలంటీర్ల, న్యాయవాదులు, వైద్యసిబ్బంది బృందంగా ఏర్పడి మానసికంగా ఉన్న పిల్లలను, బాల్యవివాహాలు, చదువుకు దూరంగా ఉన్నపిల్లలను గుర్తించి నివేదిక అందించాలన్నారు. న్యాయవాది గంగాదర్‌కుమార్, సూర్యనారాయణ, మనోహర్‌రెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక లాభాలు: జేడీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీ ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): పంటల సాగు విధానంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక లాభాలు పొందవచ్చని జేడీ ఉమామహేశ్వరమ్మ అన్నారు. వజ్రకరూరు మండలంలోని రూపానాయక్ తండాలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. వేరుశనగ సాగులో తెగులు సోకకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు ఆమె వివరించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే ప్రభుత్వం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఏవో మధుకర్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది డాకునాయక్, రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు. అలాగే పెద్దకౌకుంట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వేరుశనగ పంట పొలాన్ని ఏవో శుభకర్ పరిశీలించారు.

ఏజీపీగా హేమాద్రి



గుంతకల్లు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టు అసిస్టెంటు గవర్నమెంట్ ప్లీడరు (ఏజీపీ)గా పట్టణానికి చెందిన న్యాయవాది ఎన్ హేమాద్రి నియమితులయ్యారు. సీనియర్ న్యాయవాదిగా ఉన్న హేమాద్రి టీడీపీలో క్రియాశీలకంగా పనిచేసినందుకు అధిష్టానం గుర్తించి నామినేటెడ్ పదవిలో నియమించింది. ఈ మేరకు లీగల్, లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ విభాగం నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. తనపై నమ్మకముంచి సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా నామినేటెడ్ పదవి రావడానికి కారణమైన స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, మంత్రులు ఫరూఖ్, టీజీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ... ఒకరి మృతి

తాడిపత్రి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని రింగురోడ్డు వద్ద మంగళవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో రాముడు అనే వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణంలోని బంకమడి వీధికి చెందిన రాముడు లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. కొత్త బ్రిడ్జి నుంచి నుంచి బంకమడి వీధిలో ఉన్న తన ఇంటికి వెళుతుండగా శివాలయం వైపునుంచి కొత్త బ్రిడ్జి వైపునకు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో రాముడు మృతి చెందాడు. మల్లికార్జున అనే వ్యక్తి గాయపడ్డాడు. రాముడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గోకులం గగ్గోలు..!

● షెడ్లకు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం
● లబ్ధిదారులకు ఆర్థిక కష్టాలు

రాయదుర్గం/బొమ్మనహాళ్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గోకులం పేరుతో పాడి రైతులకు సబ్సిడీతో షెడ్లు నిర్మించుకునే అవకాశం కల్పించింది. అధికారులు వెంటబడి మరీ.. షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చేశారు. బిల్లులు మాత్రం ఇవ్వట్లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. అప్పులు చేసి.. షెడ్లు నిర్మించుకున్నామనీ, ఇప్పుడు బిల్లులు అందకపోవడంతో వాటికి వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గోకులం షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. వీటి పట్ల అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. చాలా మంది దరఖాస్తు చేసుకుని, షెడ్ల నిర్మాణం చేపడుతున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు 257 యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్ విలువ రూ.2.30 లక్షలు కాగా.. లబ్ధిదారుడి వాటా కింద పది శాతం చెల్లించాలి. మిగిలిన 90శాతం ప్రభుత్వం సబ్సిడీ కింద మంజూరు చేస్తుంది.దీని కోసం రూ.5.91 కోట్ల నిధులను కేటాయించారు. బొమ్మనహాళ్ మండలానికి 31 యూనిట్లు మంజూరు కాగా.. 29 నిర్మాణాలు ప్రారంభించారు. వాటిలో 19 పూర్తయ్యాయి. డీ హీరేహాళ్‌లో 74లో 14 పూర్తయ్యాయి. కణేకల్లులో 60కిగాను 23, గుమ్మఘట్టలో 41కిగాను 22, రాయదుర్గంలో 51కిగాను 21 యూనిట్లు పూర్తయ్యాయి. 257 యూనిట్లలో 99 యూనిట్లు పూర్తయ్యాయి. మిగిలిన వాటి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. అధికారులు మాత్రం పాడి రైతులతో హడావుడిగా షెడ్ల పనులను ప్రారంభింపజేశారు. నిధుల కొరత లేదనీ, త్వరితగతిన పూర్తి చేసుకోవాలని చెప్పారు. దీంతో లబ్ధిదారులు అప్పులు చేసి మరీ షెడ్లను నిర్మించుకున్నారు. తీరా బిల్లుల చెల్లింపు విషయానికొచ్చే సరికి అధికారులు చేతులెత్తేస్తున్నారు. అదిగో.. ఇదిగో.. అంటూ ఉపాధి సిబ్బంది కాలయాపన చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణాలు పూర్తయిన గోకులం షెడ్ల ప్రారంభోత్సవాలు పండుగ వాతావరణంలో చేపట్టారు. బిల్లుల మాటేమిటని లబ్ధిదారులు.. అధికారులను నిలదీస్తున్నా వారి నుంచి స్పందన లేదు.



లింగదహాళ్‌లో నిర్మించిన గోకులం షెడ్డు

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుత్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ రోహిత్‌కుమార్ సూచించారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎస్పీ మాట్లాడుతూ దేశంలో ఆల్‌లైన్ మోసాలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ ఆంజనేయులు, కళాశాల ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్‌బాషా, సైబర్‌సెక్యూరిటీ విభాగాధిపతి మోహన్‌దాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందిపై విచారణ

కుందుర్పి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంచంపల్లి అంగన్‌వాడీ కేంద్రంపై గ్రామస్థులు కొన్ని రోజుల క్రితం తాళాలువేసి కార్యకర్తలకు బయటికి పంపించారు. మంగళవారం పీడీ వనజా అక్కమ్మ, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి ఈ విషయంపై గ్రామస్థులను విచారించారు. గ్రామస్థులు అంగన్‌వాడీ కేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలు జరిగినట్లు వారి దృష్టికి తీసుకువచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాను ఇద్దరిని తప్పించాలన్నారు. విచారణ చేసిన నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు.

మోడల్ స్కూల్ టీచర్లపై విచారణ జరిపించాలి

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ స్కూల్‌లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న టీచర్లపై డిప్యూటీ డీఈఓ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. విద్యాశాఖ అధికారులు సమస్యలు పరిష్కరించకపోతే మోడల్‌స్కూల్ ఎదుట దశలవారీగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు వలి, లోకేష్, అశోక్, గణేష్, గౌతమ్ పాల్గొన్నారు.

ప్రారంభంకాని యూనిట్లను రద్దు చేయండి: కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం టెక్స్‌టైల్స్ పార్క్‌లో ఇంకా ప్రారంభంకాని 47 యూనిట్లను రద్దుచేయాలని కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్ మాట్లాడారు. పనులు ప్రాంభంకాని యూనిట్లను రద్దు చేసి ఆ స్థానంలో కొత్త నోటిఫికేషన్ జారీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయదుర్గం టెక్స్‌టైల్స్ పార్క్‌లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే పంచాయతీ అధికారు ల ద్వారా పరిష్కరించాలన్నారు. అరవింద్ కంపెనీవారు యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చారని తెలిపారు. పార్క్‌లోగానీ, వారు కోరుకున్న చోటగానీ భూమిని కేటాయించాలని ఆదేశించారు. చేనేత, జౌళి, పరిశ్రమలశాఖ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ ప్రభావతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులందరూ హాజరుకాగా ప్రజాప్రతినిధులు మాత్రం తమకేమీ పట్టనట్టు సమావేశానికి హాజరుకాకపోవడంతో పలు విమర్శలకు దారితీస్తున్నాయి. ఉన్న సభ్యులతోనే తూతూమంత్రంగా సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ ప్రభావతమ్మ మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌కు అధికారులు హాజరు కాకపోవడంపై మండిపడ్డారు.

కంది కొనుగోలు కేంద్రం ఏర్పాటు



కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

కూడేరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో మార్క్‌ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో కూడేరులో కంది కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని టీడీపీ నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు ప్రారంభించారు. ఏఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఒక్క కేంద్రం ఏర్పాటు చేయగా మంత్రి చొరవతో రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రభుత్వ నిబంధనలు సడలించారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచు లలితమ్మ, నాయకులు జయప్రకాష్‌గౌడ్, బొమ్మయ్య, నారాయణస్వామి, బాట వెంకటేష్, గొల్ల వెంకటేష్, ఎద్దుల సుధాకర్, అంకే భీమా, వెంకటేష్, ముట్టాల అక్కులప్ప, మసూద్‌వలి, గండి రామాంజనేయులు, ఏఓ విజయ్‌కుమార్, ఏఈఓ శైలజ ఎంపీఈఓలు పాల్గొన్నారు.

వైసీపీ దుష్ప్రచారాన్ని మానుకోవాలి

పామిడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం 1/70 చట్టాన్ని రద్దు పరుస్తున్నట్లు వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి రాజేష్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గిరిజన అభివృద్ధి కేవలం టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. వైసీపీ పాలనలో గిరిజనులకు ఏమి చేశారో చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ధర్నాలు, ర్యాలీలు, బంద్‌లకు అనుమతి ఇస్తోందని గుర్తు చేశారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎంపీపీ మాధవి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మాధవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడంలేదని విద్యుత్ ఏఈని పలువురు టీడీపీ మద్దతు సర్పంచులు నిలదీశారు. దోనిముక్కల రోడ్డులోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు సరిగ్గా భోజనం అందడంలేదని జడ్పీటీసీ కదిరప్ప అన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఆదివారం మధ్యాహ్నభోజనం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ మస్తాన్‌రావు చెప్పారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు గ్రామ ప్రగతిని చదివి వినిపించారు. ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి, తహసీల్దారు రమాదేవి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించండి

పామిడి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో రానున్న వేసవికాలంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆకస్మికంగా ఆయన మండలంలో పర్యటించారు. ముందుగా కొండాపురం సీపీడబ్ల్యూఎస్ స్కీం వాటర్ పంపు హౌస్‌ను పరిశీలించారు. అనంతరం వంకరాజు కాలువలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంను తనిఖీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో పలురికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిరుపాల్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి: డీఆర్‌ఎం

గుంతకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమకాలీన సమాజిక అవగాహనను పెంపొందించుకోవడానికి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొనాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా సూచించారు. దేశంలో రైల్వే విద్యుద్ధీకరణ కార్యక్రమం చేపట్టి వందేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. మంగళవారం ఉదయం స్థానిక రైల్వే ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు డీఆర్‌ఎం చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీఈఈ (ట్రాక్షన్) సుర్యన్ రెడ్డి, సీనియర్ డీపీఓ క్యాప్టియల్ అరోరా, సీనియర్ డీఓఎం శ్రవణ్‌కుమార్, సీనియర్ డీసీఎం మనోజ్, ఏపీఓ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

గుంతకల్లు రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తాం

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పలు నిర్మాణ కార్యక్రమాలను చేపట్టి జంక్షన్‌ను అభివృద్ధిపరుస్తామని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక రైల్వే ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఓ కార్యక్రమంలో డీఆర్‌ఎం విలేఖరులతో మాట్లాడారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని 6-7 ప్లాట్‌ఫారాలలో ఉన్న పాత భవనాలను తొలగించి పునర్నిర్మిస్తామన్నారు. స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలను అనుసంధానిస్తామని, నిర్మాణంలో ఉన్న విద్యుత్ ట్రాక్షన్ షెడ్‌ను పూర్తిచేసి కనిష్టం 100, గరిష్ఠంగా 250 విద్యుత్ లోకోలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ధర్మవరం-పాకాల డబుల్ లైన్ నిర్మాణ కార్యక్రమం కాస్త ఆలస్యం అవుతుందని తెలిపారు.



విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న డీఆర్‌ఎం

లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్న డీఆర్‌ఎం

గుంతకల్లుటౌన్: మండలంలోని కసాపురం గ్రామ శివారులో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజరు చంద్రశేఖర్ గుప్త దంపతులు మంగళవారం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు డీఆర్‌ఎం దంపతులకు స్వాగతలం పలికారు. వారి పేరట అర్చనలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తలారి పరుశురాముడు, కమిటీసభ్యులు రామ్‌చరణ్‌తేజ, నాగరాజు, సౌమ్య, భవాని, శంకర్, సంధ్య, సుదర్శన్, నారాయణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

● జాతీయ రహదారి పక్కనే ఆక్రమణల పర్వం
● చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, వంకలు, చెరువులు కబ్జాదారుల పరమవుతున్నాయి. ప్రస్తుతం గుట్టలపై వీరి కన్ను పడింది. పట్టణానికి కూత వేట దూరంలోని జాతీయ రహదారికి పక్కనే ఆక్రమణల పర్వం కొనసాగుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. మండలంలోని కసాపురం గ్రామం చెన్నప్ప కొట్టాల రోడ్ క్రాస్ వద్ద సర్వేనెంబర్424, 25లో ప్రభుత్వ గుట్ట ఉంది. సర్వేనెంబర్ 424లో 27సెంట్లు, 425లో 3.52ఎకాల గుట్ట ఉది. ఈ గుట్టపై ఓ రైల్వే కాంట్రాక్టర్ కన్ను పడింది. ఎక్స్‌కవేటర్లతో చదును చేసి మట్టిని తవ్వుతున్నాడు. గుట్టను తవ్వి ఎర్రమట్టిని ట్రాక్టర్లు, టిప్పర్లతో తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్ వద్ద లూప్‌లైన్ రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం ఉపయోగిస్తున్నాడు. లక్షలు విలువ చేసే మట్టిని యథేచ్ఛగా తవ్వుతున్నా పర్యవేక్షించాల్సిన రెవెన్యూ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం పలు విమర్శలు దారితీస్తోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్న కాంట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల సహకారంతోనే ఆ కాంట్రాక్టర్ గుట్టలో మట్టిని తవ్వుతున్నట్లు సమాచారం. దీనిపై తహసీల్దార్ రమాదేవిని వివరణ కోరగా గుట్టను చదును చేసి మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని త్వరలో పరిశీలిస్తామన్నారు. అక్రమంగా గుట్టను తవ్వి మట్టిని తరలిస్తే విచారించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రభుత్వ గుట్టలో మట్టిని తవ్వి, తరలిస్తున్న అక్రమార్కులు

పట్టాభిరాముడికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టాభిరామస్వామికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పట్టు వస్త్రాలు నేయించారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. హిందూ, ముస్లింలు ఐక్యతను చాటుతూ ముస్లిం తీసుకువచ్చిన లక్ష పూలను ఎమ్మెల్యే ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సంప్రదాయ బద్ధంగా స్వామి వారికి పట్టువస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా హిందూ, ముస్లింల ఐక్యత మన కళ్యాణదుర్గంలో వచ్చిందన్నారు. ఆ శ్రీరామచంద్రుడి ఆశీస్సులతో మన ప్రాంతంలోని రైతులు మంచి పంటలు పండించాలని, బీటీపీ కాలువ త్వరగా పూర్తి అయ్యేలా దీవించాలని స్వామివారిని కోరుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భక్తులకు వడ్డించారు. అయోధ్య బాలరాముడి ఆలయానికి గంటలు అందించిన రాజేంద్రనాయుడు పట్టాభి రామాలయానికి కూడా గంటను అందించారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

బ్రహ్మసముద్రం: మండలంలోని పడమటి కోడిపల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హాజరై పూజలు నిర్వహించారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. సభలో ఎమ్మెల్యే ప్రసంగిస్తూ గ్రామంలో ఉన్న ప్రజలు ఆహ్వానానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. జడ్పీటీసీ ప్రభావతమ్మ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, మాజీ కన్వీనర్ వెంకటేశులు, క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 8 మందికి గాయాలు

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది గాయపడ్డారు. మండలంలోని బళ్లారి-రాయదుర్గం ప్రధాన రహదారిపై వసగుడ్డం గ్రామం సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం జిల్లా అశోక సిద్ధాపురం గ్రామానికి చెందిన ఆటోలో అదే గ్రామానికి చెందిన కొంతమంది కల్యం, పల్లేపల్లి గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు మంగళవారం ఉదయం కూలీ పనుల కోసం వస్తుండగా వసగుడ్డం గ్రామ సమీపంలో మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురు కూలీలు గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని అంబులెన్స్ ద్వారా గాయపడ్డ కూలీలను బళ్లారి విమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దంపతులకు గాయాలు

రాయదుర్గంరూరల్: మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో వైఎస్సార్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పాలయ్య, పాపమ్మ అనే దంపతులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన పాలయ్య, పాపమ్మ వ్యవసాయ పనులు ముగించుకొని టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై తిరిగి వస్తుండగా వైఎస్సార్ సర్కిల్ వద్ద వెనుకవైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయపడ్డారు.

గడ్డి వాములకు నిప్పు

విడపనకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.కొట్టాల గ్రామంలో ఊరి చివరణ ఉన్న గడ్డివాములకు మంగళవారం మధ్యాహ్నం ప్రమాద వశాత్తు నిప్పు అంటుకుంది. గమనించిన గ్రామస్థులు వెంటనే స్పందించి ఉరవకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్ని మాపక సిబ్బంది, గ్రామస్థులు కలిసి మంటలను అదుపు చేశారు.

కొండకు...



బసంపల్లి వద్ద కొండ వద్ద రగులుతున్న మంటలు

శెట్టూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలం బసంపల్లి గ్రామ సమీపంలో మంగళవారం బాదిపల్లి కొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో కొండ ప్రాంతం అగ్నికి ఆహుతవుతోంది. కొండలో వున్న పశుగ్రాసం, చెట్లు దగ్ధమయ్యాయి.

అడవిపంది ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మింపల్లి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనంలో వెళుతున్న నరేష్ అనే వ్యక్తి అడవిపందిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలమేరకు పామిడి మండలం ఖాదర్ పేట గ్రామానికి చెందిన నరేష్ మల్లేపల్లి గ్రామంలో ఉన్న తన బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా పందుల గుంపు రహదారి దాటుతుండగా వాటిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రజలు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డీఎంహెచ్ఓ మందలించినా మారని తీరు!



ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓ వైద్యాధికారి తీరు మారడం లేదు. ఇటీవల డీఎంఅండ్‌హెచ్ఓ ఈబీ దేవి మందలించినా తీరు మారడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రోగులకు వైద్య సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. 24 గంటలూ వైద్య సేవలు అందించాల్సి ఉన్నా, కొందరు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. 6న డీఎంఅండ్‌హెచ్ఓ ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్య సేవలపై అసంతృప్తి వ్యక్తంచేసి వైద్యాధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా ఆయనలో ఎటువంటి మార్పు రాకపోవడంపై స్థానికులు చర్చించుకుంటున్నారు. మంగళవారం ఆ వైద్యాధికారి కుర్చీ ఖాళీగా కన్పించింది. డాక్టరు రాలేదా అని కొందరు విలేకరులు ఆసుపత్రి సిబ్బందిని ఆరాతీయగా ఉదయం వచ్చి వెళ్లారని చెప్పారు.